**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :151 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 18 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## న్యాయం కోసం నిలబడండి

- విద్యార్థులకు సీజేఐ సూర్యకాంత్ సూచన
- న్యాయవిద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు న్యాయం కోసం నిలబడాలి
- రాజ్యాంగ విలువలను కాపాడాలని
- భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ సూచన
- వృత్తిలో నిజాయతీగా ఉంటూ, ఇతరుల సమస్యలను అర్థం చేసుకోవాలి



## సీఆర్పీఎఫ్ జవాన్లకు గుడ్ న్యూస్

- సీఆర్పీఎఫ్‌లో లాన్స్ నాయక్, నాయక్ ర్యాంకుల పునరుద్ధరణకు యోచన
- జవాన్ల పదోన్నతుల్లో జాప్యాన్ని తగ్గించేందుకు కీలక ప్రతిపాదన
- దాదాపు 30 ఏళ్ల క్రితం రద్దయిన ర్యాంకులను మళ్లీ తెచ్చేందుకు కసరత్తు
- త్వరలో దళంలో చేరనున్న అగ్నివీరులకు లబ్ధి చేకూర్చే అవకాశం
- దేశవ్యాప్తంగా సైనిక్ సమ్మేళన్ల ద్వారా అభిప్రాయ సేకరణకు ఆదేశం

# సమర్థంగా తిప్పికొట్టాలి

- కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయండి
- స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- సోషల్ రీ-ఇంజినీరింగ్ ద్వారా అన్ని వర్గాలకూ సమాన అవకాశాలు కల్పించాం
- క్షేత్రస్థాయిలో కూటమి నేతలు మిత్రధర్మం పాటిస్తూ కలుపుకొని వెళ్లాలి
- స్థానిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వైఎస్సార్సీపీ వ్యవహరిస్తోంది
- గొడ్డలి పార్టీ చర్యలు, కుట్రలను నిశితంగా గమనిస్తూ ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలి



**అమరావతి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో 2024 ఎన్నికల ఫలితాలను మించి ఓట్ల శాతం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. గెలుస్తామన్న ధీమాతో నిర్లక్ష్యం చేయకుండా ప్రతి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీలో క్షేత్రస్థాయిలో పర్యటించి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అమరావతి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సోషల్ రీ ఇంజనీరింగ్ ద్వారా జనాభా ప్రాతిపదికన అన్ని సామాజిక వర్గాలకూ సమాన అవకాశాలు కల్పించామని తెలిపారు. ప్రజాభిప్రాయం, పార్టీ కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని

వివరాలు 2లో..



## డబుల్ ఇంజన్‌తోనే దేశాభివృద్ధి

- మధ్యప్రదేశ్ సీఎంకు ఏపీ అభివృద్ధిని వివరించిన చంద్రబాబు
- సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి
- అమరావతి నిర్మాణం, రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలపై వివరించిన చంద్రబాబు
- మధ్యప్రదేశ్ సీఎంకు తన యువగళం పాదయాత్ర పుస్తకాన్ని అందించిన లోకేశ్
- ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం... చంద్రబాబు, పవన్‌తో వేర్వేరుగా భేటీ
- సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ
- మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశం

## యూపీ, ఉత్తరాఖండ్‌లో బీజేపీ వ్యూహం

- యోగి ఆదిత్యనాథ్, పుష్కర్ సింగ్ ధామికే మళ్లీ పగ్గాలు!
- యూపీ, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ నాయకత్వంపై స్పష్టత
- యోగి ఆదిత్యనాథ్, పుష్కర్ సింగ్ ధామి సారథ్యంలోనే బరిలోకి
- నాయకత్వ మార్పు ఉంటుందన్న ఊహాగానాలకు చెక్ పెట్టిన అధిష్ఠానం
- లోక్‌సభ ఫలితాల తర్వాత యూపీ నాయకత్వంపై ప్రత్యేక దృష్టి
- త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుందని సమాచారం



## రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తీవ్రచర్యలు



- స్థానిక ఎన్నికల నామినేషన్ల తొలిరోజు చోటుచేసుకున్న పలు హింసాత్మక ఘటనల్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం
- రాష్ట్ర ఎన్నికల అధికారి అనిల్‌చంద్ర పునేఠా
- నామినేషన్ల రోజు జరిగిన ఘటనలపై రాజకీయ పార్టీలు ఫిర్యాదులు చేశాయని వెల్లడించారు.
- రాష్ట్రంలో శాంతిభద్రతలపై రాజకీయపార్టీల నేతలు ఫిర్యాదు
- 144 సెక్షన్ ఉన్నందున ర్యాలీలు, ధర్నాలు చేయకూడదు

**అమరావతి**

స్థానిక ఎన్నికల నామినేషన్ల తొలిరోజు చోటు చేసుకున్న పలు హింసాత్మక ఘటనల్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. నామినేషన్ల రోజు జరిగిన పలు ఘటనలపై రాజకీయ పార్టీలు ఫిర్యాదులు చేశాయని వెల్లడించారు. మీడియా సమావేశంలో మాట్లాడిన రాజుజ అనిల్‌చంద్ర పునేఠా, సమస్యాత్మక ప్రాంతాల్లో మరింత పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని

వివరాలు 2లో..



## బలూచిస్థాన్‌లో ఉద్రిక్తత

- బలూచిస్థాన్‌లో 20 మంది పోలీస్ రిక్రూట్‌లను అపహరించిన సాయుధులు
- ఇది బలోచ్ వేర్పాటువాదుల పనేనని అనుమానం
- రాష్ట్రంలో బలవంతపు అదృశ్యాలు, కస్టడీ మరణాలపై తీవ్ర ఆరోపణలు
- పాక్ భద్రతా బలగాల అధీనంలో పలువురు టీచర్ల మృతి చెందినట్లు ఆరోపణలు
- మస్తుంగ్ జిల్లాలో గాలింపు చర్యలు ముమ్మరం చేసిన పాక్ సైన్యం

## నామినేషన్ల వేడి.. రెండో రోజూ భగ్గుమన్న ఘర్షణలు

- గాల్లోకి కాల్పులు జరిపిన పోలీసులు
- రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పలు జిల్లాల్లో రెండో రోజూ టీడీపీ, వైఎస్సార్సీపీ వర్గీయుల మధ్య ఘర్షణలు
- వివిధ ప్రాంతాల్లో ఘటనల దృష్ట్యా పోలీసులు భారీగా మోహరించారు.
- టీడీపీ, వైఎస్సార్సీపీ వర్గీయుల మధ్య ఘర్షణలు
- రాయచోటిలో మరోసారి ఉద్రిక్తత



**అమరావతి**

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పలు జిల్లాల్లో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. నామినేషన్ కేంద్రాల వద్ద అధికార, ప్రతిపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. 2021లో దౌర్జన్యాలతో ఏకగ్రీవాలు చేసుకున్న తరహాలోనే ఇప్పుడూ వైఎస్సార్సీపీ అనుసరిస్తున్న విధానాలు ఘర్షణలకు దారితీస్తున్నాయి. పుంగనూరు, తిరుపతి, ధర్మవరం, రాయచోటిలో నామినేషన్ల తొలిరోజు జరిగిన ఘటనలు వైఎస్సార్సీపీ దౌర్జన్యకాండకు అద్దం పడుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలిరోజే వైఎస్సార్సీపీ అరాచకపర్వం మొదలైంది. 2021 ఎన్నికల తరహాలోనే అలజడులు సృష్టించి నామినేషన్లు వేసేందుకు వచ్చేవారిని భయపెట్టి అడ్డుకోవాలనే పంథానే అమలు చేయాలని ఆ పార్టీ నిర్ణయించుకున్నట్లు తొలిరోజే తేలిపోయింది. నేడు రెండో రోజూ పలు జిల్లాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అన్నమయ్య జిల్లా రాయచోటిలో నేడు మరోసారి ఉద్రిక్తత నెలకొంది. మదనపల్లి రోడ్డులోని ఓ లాడ్జిలో వైఎస్సార్సీపీ కార్యకర్తలు, కర్ణాటక నుంచి వచ్చినవారు, బౌన్సర్లు మకాం వేసినట్లు సమాచారం అందడంతో

వివరాలు 2లో..



## ఆన్‌లైన్ గేమింగ్ ముఠా గుట్టురట్టు

- హైదరాబాద్‌లోనూ ఈడీ మెరుపుదాడులు...
- హైదరాబాద్ సహా ఐదు నగరాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై ఈడీ దాడులు
- అక్టోబర్ 13న 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు
- దుబాయ్ కేంద్రంగా బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు సాగుతున్నట్లు గుర్తింపు
- షెల్ కంపెనీలు, క్రిప్టో కరెన్సీ ద్వారా నిధులను విదేశాలకు తరలిస్తున్నట్లు వెల్లడి
- కేసుతో సంబంధం ఉన్న పలు బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసిన ఈడీ

# నామినేషన్ల వేడి రెండో రోజూ భగ్గుమన్న ఘర్షణలు

-మొదటిపేజీ తరువాయి

తెలుగుదేశం కార్యకర్తలు అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. దీంతో లాడ్జి పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైఎస్సార్సీపీ, తెలుగుదేశం వర్గాలు పరస్పరం ఘర్షణకు దిగారు. ఘర్షణల్లో అక్కడే ఉన్న ఓ కారు ధ్వంసమైంది. పోలీసులు లాడ్జి వద్దకు చేరుకొని వైఎస్సార్సీపీ శ్రేణులు సహా కర్ణాటక వ్యక్తులు, బౌన్సర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద మారణాయుధాలు ఉన్నట్లు గుర్తించారు. రాయచోటిలో నిన్న అల్లర్లు చెలరేగిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మరోసారి అల్లర్లకు తావివ్వకుండా పెద్ద ఎత్తున భద్రతా బలాగలను మోహరించారు. పెద్ద సంఖ్యలో పోలీసులు పట్టణానికి చేరుకున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. రాయచోటిలో ర్యాలీలు, ఆందోళనలను పోలీసులు నిషేధించారు. అదనపు ఎస్పీ వెంకటాద్రి పట్టణంలో పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.



**పులివెందులలో కాల్పులు జరిపిన పోలీసులు**

తెలుగుదేశం, వైఎస్సార్సీపీ వర్గీయుల పరస్పర దాడులతో కడప నగరం సహా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో గందరగోళం నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ రెండో రోజున కడప నగరంలోని పలు నామినేషన్ కేంద్రాల వద్ద వైఎస్సార్సీపీ, తెలుగుదేశం దాడులు చేసుకున్నాయి. ఒకరిపై మరొకరు రాళ్లు రువ్వుకున్నారు. పరిస్థితి అదుపుతప్పక ముందే పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను ఎక్కడికక్కడ చెదరగొట్టాయి.

అటు రాజంపేటలోనూ టీడీపీ, వైఎస్సార్సీపీ శ్రేణులు దాడులకు దిగాయి. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. కడప జిల్లాలో ఘర్షణల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అంజాద్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులపైకి వైఎస్సార్సీపీ కార్యకర్తలు దూసుకెళ్లడంతో పోలీసులు కాల్పులు జరిపారు. గాలిలోకి ఆరు రౌండ్ల కాల్పులు జరిపారు. వైఎస్సార్సీపీ కార్యకర్తలను అదుపు చేసేందుకు పోలీసులు కాల్పులు జరిపారు.

**తిరుపతిలో ఈనాడు రిపోర్టర్‌పై దాడి**

తిరుపతిలో ఈనాడు రిపోర్టర్‌పై తెలుగుదేశం కార్యకర్తలు దాడి చేశారు. తిరుపతి మున్సిపల్ కార్యాలయం సమీపంలో నామినేషన్ సమయంలో ఫోటోలు తీస్తుండగా ఈనాడు రిపోర్టర్ గంగాధర్‌శర్మపై దాడికి పాల్పడ్డారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన సమయంలో ఫోటోలు తీస్తుండగా రిపోర్టర్ ఫోన్ లాక్కొని కొట్టారు. గంగాధర్ శర్మ ఫోన్‌లోని ఫోటోలను టీడీపీ కార్యకర్తలు డిలీట్ చేసి తిరిగి ఇచ్చారు.

**తాడిపత్రిలో భారీగా పోలీసుల మోహరింపు**

నామినేషన్ల దృష్ట్యా అనంతపురం జిల్లా తాడిపత్రిలో భారీగా పోలీసులను మోహరించారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం వద్ద బలగాలు తనిఖీలు చేస్తున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వజ్రవాహనం, బాష్పవాయువు గోళాలను పోలీసులు సిద్ధం చేశారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. నామినేషన్ల దాఖలుకు టీడీపీ, వైఎస్సార్సీపీ అభ్యర్థులకు వేర్వేరుగా గదులు కేటాయించారు.

**అప్రమత్తమైన పోలీసులు**

మరోవైపు నామినేషన్ల తొలిరోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఘటనలు దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున సమస్యాత్మక ప్రాంతాల్లో వైఎస్సార్సీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. పలువురు నేతలను గృహనిర్బంధం చేశారు. కడప జిల్లాలో వైఎస్సార్సీపీ నేతలు అవినాష్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, అంజాద్‌బాషాకు నోటీసులు అందజేశారు. అల్లర్లు, గొడవలు సృష్టించవద్దని నేతలను పోలీసులు కోరారు. 144 సెక్షన్ ఉన్నందున ర్యాలీలు, ధర్నాలు చేయకూడదని నోటీసుల్లో పేర్కొన్నారు. మరో వైపు పల్నాడు జిల్లాలోనూ వైఎస్సార్సీపీ నేతలను గృహనిర్బంధం చేశారు. మాచర్లలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గృహనిర్బంధం చేశారు. నోటీసులు జారీ చేసిన పోలీసులు నామినేషన్ల దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డిని నరసరావుపేటలో హౌస్ అరెస్ట్ చేశారు.

# ఏపీలో స్థానిక ఎన్నికల పోరు రెండో రోజు భారీగా నామినేషన్లు

రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ రెండో రోజు నామినేషన్ కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. ఇంకా ఒక్కరోజే ఉండటంతో అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థిగా టీడీపీ తరఫున ఎనుముల పుష్ప నామినేషన్ సమర్పించారు. బాపట్ల జిల్లా చీరాల పురపాలక సంఘానికి వార్డు సభ్యుల అభ్యర్థులు నామపత్రాలు దాఖలు చేశారు. అయితే ఛైర్మన్ పదవికి ఒక్క నామినేషన్ రాకపోవడం విశేషం.



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మున్సిపాలిటీలో వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు అనేకమంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్పీకర్ అయన్నపాత్రుడు సతీమణి పద్మావతి ఛైర్‌పర్సన్ పదవికి ఇప్పటికే నామినేషన్ వేయగా వైఎస్సార్సీపీ నుంచి చింతకాయల సన్యాసిపాత్రుడు సతీమణి మున్సిపల్ మాజీ ఛైర్మన్? అనిత నామినేషన్ దాఖలుకు సిద్ధమవుతున్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో నామినేషన్ల పర్వం రెండో రోజు ఉత్సాహంగా కొనసాగింది. ఇవాళ మొత్తం 84 నామినేషన్లు దాఖలయ్యాయి. కూటమి ఛైర్మన్? అభ్యర్థిగా వక్కలగడ్డ మల్లికార్జున్?తో పాటు పలువురు వార్డు సభ్యులుగా నామపత్రాలు దాఖలు చేశారు.

కనిగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా వైఎస్సార్సీపీ తరఫున కేంద్రమాజీ మంత్రి పులివెంకటరెడ్డి మనుమరాలు శాంతిరెడ్డి నామపత్రం దాఖలు చేశారు. అద్దంకి పురపాలక సంఘం ఛైర్మన్?, కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఛైర్మన్? అభ్యర్థిగా కూటమి తరఫున కాకాని అశోక్, వైఎస్సార్సీపీ అభ్యర్థిగా ఉడత్తు సురేశ్?తో పాటు మరో ముగ్గురు నామినేషన్లు సమర్పించారు. అదేవిధంగా 32 వార్డులకు మొత్తం 37 నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. వీటిలో వైఎస్సార్సీపీ తరఫున 25, తెలుగుదేశం తరఫున 10, జనసేన తరఫున 2 నామినేషన్లు ఖలైనట్లు సమాచారం.

ా్రా నాశీఝ్రీ దీశీఎఎ జుశ్రీవఝ్‌అశీఅం 2026 : మదనపల్లె మున్సిపాలిటీలో రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఇవాళ మొత్తం 90 మంది అభ్యర్థులు నామపత్రాలు దాఖలు చేశారు. పుంగనూరు, రాయచోటి పురపాలక సంఘాల్లో జరిగిన ఘటనలను తీవ్రంగా పరిగణించిన పోలీసులు నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఛైర్మన్ అభ్యర్థిగా కూటమి తరఫున గుండ్లపల్లె శ్రీరామ్, వైఎస్సార్సీపీ అభ్యర్థిగా చినబాబు నామినేషన్ వేశారు. పుంగనూరులో రెండో రోజు 59 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ 44, బీజేపీ 3, జనసేన 8, స్వతంత్ర అభ్యర్థులుగా నలుగురు నామపత్రాలు దాఖలు చేశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి ఇవాళ 42 మంది వార్డు కౌన్సిలర్?లుగా, ఛైర్మన్ అభ్యర్థిగా వైఎస్సార్సీపీ తరఫున కొడిగంటి శివన్న రఘు నామినేషన్లు దాఖలు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో మున్సిపల్ వార్డులు, ఛైర్మన్ నామినేషన్ దాఖలు రెండో రోజు జోరుగా సాగింది. తెలుగుదేశం తరఫున మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా పురిడి మంజునాథ్, పలు వార్డులకు టీడీపీ, జనసేన, బీజేపీ, వైఎస్సార్సీపీ అభ్యర్థులు నామపత్రాలు దాఖలు చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా వైఎస్సార్సీపీ తరఫున సానబోయిన సునీలదేవి నామినేషన్ వేశారు. విజయనగరం మేయర్ పదవికి జనసేన రెబల్ అభ్యర్థి గురాన రాధిక నామినేషన్ వేశారు. కూటమి పార్టీల పొత్తులో భాగంగా విజయనగరం మేయర్ టీడీపీకి కేటాయించారు. ఈ నేపథ్యంలో రాధిక నామినేషన్ రాజకీయంగా చర్చనీయాంశమైంది. విశాఖ జీవీఎంసీ సౌత్ జోనల్ కార్యాలయంలో 36 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

## నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!: విజయసాయిరెడ్డి



ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీల మధ్య పౌర యుద్ధం (సివిల్ వార్) నడుస్తోందని, రెండు కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. గత రెండు రోజులుగా పుంగనూరు, రాయచోటి, తాడిపత్రి, ఆళ్లగడ్డ వంటి పట్టణాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను విజయసాయిరెడ్డి తన పోస్టులో ప్రస్తావించారు. "రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప రాజకీయం నడుస్తోంది. చంద్రబాబు, జగన్ కుటుంబాల మధ్య, ఆ రెండు కుల, మైనారిటీ కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఓ సివిల్ వార్ నడుస్తోంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. కర్రలు, కత్తులు, గూండాలు, బౌన్సర్లు, నామినేషన్లు చించివేయడం, జీపులతో ఢీకొట్టడం, నెత్తురోడేలా దాడులు చేసుకోవడం వంటి దృశ్యాలు దేశవ్యాప్తంగా రాష్ట్ర పరువును తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అరాచకం కొనసాగితే, 2029 నాటి సాధారణ ఎన్నికల్లో ఈ పార్టీలు నేరుగా బందిపోట్లకు, హత్యలు, మానభంగాలు, దొంగతనాల చరిత్ర ఉన్నవారికే టికెట్లు ఇచ్చే పరిస్థితి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, ఒక మూడో ప్రత్యామ్నాయంతో సరికొత్త రాజకీయానికి యువత (జెన్-జీ) నడుం బిగించాలని పిలుపునిచ్చారు. "ఈ అరాచకం ఇకమీదటా కొనసాగాలా? లేక, ఈ రెండు పార్టీలకు గుణపాఠం నేర్పాలా? అన్నది నిర్ణయించుకోవాలి. నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!" అంటూ తన పోస్టును ముగించారు.

## సమర్థంగా తిప్పికొట్టాలి

-మొదటిపేజీ తరువాయి

అభ్యర్థులను ఎంపిక చేశామని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణలో 50 శాతానికి పైగా మద్దతు ఉన్నవారికి ప్రాధాన్యమిచ్చామన్నారు. టీడీపీ పోటీ చేసే 11 మేయర్ స్థానాలను 11 సామాజిక వర్గాలకు కేటాయించామని చంద్రబాబు వివరించారు.

క్షేత్రస్థాయిలో కూటమి నేతలంతా మిత్రధర్మం పాటిస్తూ భాగస్వామ్య పార్టీల మనోభావాలను గౌరవించాలని చంద్రబాబు సూచించారు. పార్టీ బలోపేతంతో పాటు కూటమిని మరింత బలోపేతం చేసుకోవడం ముఖ్యమని స్పష్టం చేశారు. సీట్లు దక్కని ఆశావహులకు నిర్ణయాన్ని వివరించి, ఒకటి రెండు చోట్ల తలెత్తిన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమర్థులైన నాయకత్వం ఎదిగేందుకు సహకరించాలన్నారు.

అలాగే స్థానిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వైఎస్సార్సీపీ వ్యవహరిస్తోందని చంద్రబాబు ఆరోపించారు. గొడ్డలి పార్టీ చర్యలు, కుట్రలను నిశితంగా గమనిస్తూ ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. అదేవిధంగా వాటిని సమర్థంగా తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచించారు. కూటమి నేతలంతా ఐక్యంగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో విజయాన్ని బలంగా చాటాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

**టీడీపీ రెండో జాబితా విడుదల**

మరోవైపు మహిళా సాధికారత, సామాజిక సమీకరణాలు, యువతకు ప్రాధాన్యం అంశాలే అజెండాగా మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల రెండో జాబితాను నేడు టీడీపీ ప్రకటించింది. మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబీదాకు అవకాశం కల్పిస్తూ మరో 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ అభ్యర్థులను ఖరారు చేసింది. రెండో జాబితాలో 22 మందికి చోటు కల్పించగా 18 మంది మహిళలే ఉండటం విశేషం. బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు చెందిన 16 మందికి అవకాశం కల్పిస్తూ సామాజిక సమతూకానికి పెద్దపీట వేసింది. ఇంకా మూడు కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థులతో పాటు 28 మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ప్రకటించాల్సిన కార్పొరేషన్?లలో గుంటూరు, ఒంగోలు, మంగళగిరి-తాడేపల్లి ఉన్నాయి. మిగిలిన మున్సిపల్ స్థానాలపైనా పార్టీ నాయకత్వం కసరత్తు కొనసాగిస్తోంది.

## రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తీవ్రచర్యలు

-మొదటిపేజీ తరువాయి

తేల్చిచెప్పారు. " రాష్ట్రంలో శాంతిభద్రతలపై రాజకీయపార్టీల నేతలు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి కలెక్టర్లకు సమాచారం ఇచ్చాం. వెంటనే పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చాం. హింసాత్మక ఘటనలను తీవ్రంగా పరిగణించాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తీవ్రచర్యలు ఉంటాయి. హింసాత్మక ఘటనలు జరిగితే అదనపు బలగాలు ఏర్పాటు చేస్తాం. నామినేషన్ సెంటర్లలో అదనపు భద్రత కల్పిస్తాం. ప్రతి నామినేషన్ సెంటర్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో కలిపి ముగ్గురికి మాత్రమే అనుమతి. నామినేషన్ల వేళ అధికారుల నిర్లక్ష్యం ఉంటే బదిలీ, సస్పెండ్ చేస్తాం. అధికారుల నిర్లక్ష్యం ఉంటే క్రమశిక్షణా చర్యలు ఉంటాయి."

**అప్రమత్తమైన పోలీసులు**

మరోవైపు నామినేషన్ల తొలిరోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఘటనలు దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల కోడ్, 144 సంక్షన్ అమల్లో ఉన్నందున సమస్యాత్మక ప్రాంతాల్లో వైఎస్సార్సీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. పలువురు నేతలను గృహనిర్బంధం చేశారు. కడప జిల్లాలో వైఎస్సార్సీపీ నేతలు అవినాష్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, అంజాద్‌బాషాకు నోటీసులు అందజేశారు. అల్లర్లు, గొడవలు సృష్టించవద్దని నేతలను పోలీసులు కోరారు. 144 సెక్షన్ ఉన్నందున ర్యాలీలు, ధర్నాలు చేయకూడదని నోటీసుల్లో పేర్కొన్నారు. మరో వైపు పల్నాడు జిల్లాలోనూ వైఎస్సార్సీపీ నేతలను గృహనిర్బంధం చేశారు. మాచర్లలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గృహనిర్బంధం చేశారు. నోటీసులు జారీ చేసిన పోలీసులు నామినేషన్ల దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డిని నరసరావుపేటలో హౌస్ అరెస్ట్ చేశారు. పెద్ద ఎత్తున భద్రతా బలాగలు : అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిన్న(శుక్రవారం) అల్లర్లు చెలరేగిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మరోసారి అల్లర్లకు తావివ్వకుండా పెద్ద ఎత్తున భద్రతా బలాగలను మోహరించారు. పెద్ద సంఖ్యలో పోలీసులు పట్టణానికి చేరుకున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. రాయచోటిలో ర్యాలీలు, ఆందోళనలను పోలీసులు నిషేధించారు. అదనపు ఎస్పీ వెంకటాద్రి పట్టణంలో పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## డబుల్ ఇంజన్‌తోనే దేశాభివృద్ధి





ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా ఈ భేటీ సాగింది. ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం సహా రాష్ట్రంలో తాము చేపట్టబోతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి చంద్రబాబు, మోహన్ యాదవ్‌కు సమగ్రంగా వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన తన విజన్, ప్రణాళికలను ఆయనతో పంచుకున్నారు. అంతకుముందు, ముఖ్యమంత్రి నివాసానికి విచ్చేసిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ భేటీలో లోకేశ్ కూడా పాలుపంచుకున్నారు. తాను ఇటీవలే పూర్తిచేసిన 'యువగళం' పాదయాత్ర విశేషాలతో కూడిన పుస్తకాన్ని ఆయన మోహన్ యాదవ్‌కు బహూకరించారు. తన పాదయాత్ర అనుభవాలను, ప్రజల నుంచి వచ్చిన స్పందనను, రాష్ట్ర సమస్యలపై తాను చేసిన అధ్యయనాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి లోకేశ్ వివరించారు.

**ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం... చంద్రబాబు, పవన్‌తో వేర్వేరుగా భేటీ**

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ముందుగా ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన మోహన్ యాదవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం నివాసానికి వచ్చిన ఆయనకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. అనంతరం నేతలు కాసేపు ముచ్చటించారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో మోహన్ యాదవ్ సమావేశమయ్యారు. ఈ భేటీలో ఏపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ (చీూ=) పరిధిలో పులుల సంరక్షణ చర్యలను బలోపేతం చేయడంపై మాట్లాడారు. అలాగే, జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్ నుంచి గౌర్ (అడవి దున్నలు)ను చీూ=కు తరలించే ఒప్పందాన్ని వేగవంతం చేయాలని పవన్ కల్యాణ్ కోరారు. ఈ సందర్భంగా త్వరలోనే తాను మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని పవన్ తెలిపారు.

సమావేశం అనంతరం పవన్ కల్యాణ్.. మోహన్ యాదవ్‌ను ఉప్పాడ పట్టు శాలువాతో సత్కరించి, కొండపల్లి, శ్రీకాళహస్తి కళాకృతులతో పాటు అరకు కాఫీని బహూకరించారు. ప్రతిగా మోహన్ యాదవ్, శ్రీ ఓంకారేశ్వర స్వామి ప్రతిమను, జ్యోతిర్లింగ క్షేత్ర ప్రసాదాన్ని పవన్‌కు అందజేశారు.

# స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగు కేంద్రాల వద్ద పటిష్ట భద్రత.





**విజయనగరం, పెన్ సత్తా, అక్టోబర్ 17:** పట్టణంలో నిర్వహించే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బ్యాలట్ బాక్సులను భద్రపర్చే స్ట్రాంగ్ రూమ్స్, ఓట్ల లెక్కింపు నిర్వహించే నిర్వహించే రాజీవ్ క్రీడా ప్రాంగణం లోని ఇన్ డోర్ స్టేడియంను జిల్లా కలెక్టరు ఎస్. రామసుందర్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ శనివారం సంయుక్తంగా సందర్శించి, మున్సిపల్ అధికారులు చేపడుతున్న ఏర్పాట్లును పరిశీలించి, పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ లు మాట్లాడుతూ అనుమతి లేని వ్యక్తులను బ్యాలట్ బాక్సులను భద్రపర్చే స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లోకి ప్రవేశించకుండా బ్యారికేడ్స్ ఏర్పాటు చేయాలని, ఓట్ల లెక్కింపు నిర్వహించే కేంద్రంలో కూడా బ్యారికేడ్స్, 8 అడుగుల ఎత్తులో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద, రాజీవ్ క్రీడా ప్రాంగణంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, నిరంతరం భద్రతను పర్యవేక్షించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగు కేంద్రాల్లోకి అనుమతించే వ్యక్తుల పాస్ లను, గుర్తింపు కార్డులను పరిశీలించి, అర్హత కలిగిన వ్యక్తులను, ఏజంట్స్, ఇతర అధీకృత వ్యక్తులను మాత్రమే అనుమతించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగు కేంద్రం వద్ద ప్రజలను, ఏజంట్లను అప్రమత్తం చేసేందుకు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్స్, బెల్ హెల్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగు కేంద్రాలకు పోలింగు మెటీరియల్ తో డిస్ట్రిబ్యూషను సెంటరు నుండి తరలివెళ్ళే సమయంలోనే భద్రత విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది కూడా వెళ్ళే విధంగాను, ఓటింగు ముగిసిన తరువాత సురక్షితంగా బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్స్ కు తరలించే విధంగా భద్రత సిబ్బంది, రూట్ మొబైల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరా నిరంతరాయంగా పని చేసేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. కౌంటింగు కేంద్రంకు దగ్గరలోనే మీడియా పాయింట్ ఏర్పాటు చేయాలని, ఓట్ల లెక్కింపు వివరాలను ప్రతీ రౌండ్ పూర్తయిన వెంటనే సమాచారాన్ని ఎటువంటి జాప్యం లేకుండా అందించాలన్నారు. ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది ఎవరైనా గైర్హాజరైనా, విధుల్లో నిర్లక్షం వహించినా క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం, రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగు కేంద్రం, మీడియా పాయింట్, వాహనాల పార్కింగు, ఫుడ్ కోర్టు స్థలాలను కలెక్టరు రామసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, మున్సిపల్ కమీషనరు బి.బాలస్వామి, విజయనగరం డిఎస్పీ ఎస్.లక్ష్మణ మూర్తి, వన్ టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఇతర పోలీసు అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేసారు.

# స్థానిక సంస్థల ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి.



- ఎన్నికల కమిషన్ సూచనల మేరకే విధులు నిర్వర్తించాలి.
- ఆర్వో హ్యాండ్ బుక్ లో ఉన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలి.
- ఎన్నికల నిర్వహణ పై రిటర్నింగ్ అధికారులకు మార్గదర్శకాలు.
- జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 17:** రాబోయే ఎన్నికల నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు తమ బాధ్యతలను అత్యంత అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మున్సిపల్, జిల్లా పరిషత్, పంచాయితీ ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఆర్ వో లు, ఏ ఈ ఆర్ వో లు, జిల్లా అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ తో కలిసి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుండి అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి దశ పకడ్బందీగా జరగాలని ఆదేశించారు. ప్రతి రిటర్నింగ్ అధికారి అధికారిక హ్యాండ్ బుక్ ను పూర్తిగా చదివి, అందు లోని ప్రతి నిబంధనను, ఫార్మాట్ ను అవగతం చేసుకోవాలని, ఎన్నికల వేళ ఎవరిని సంప్రదించాల్సిన అవసరం లేకుండా హ్యాండ్ బుక్ లో అన్ని మార్గదర్శకాలు స్పష్టంగా ఉంటాయని చెప్పారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో అభ్యర్థుల నుండి రశీదులు, చెక్‌లిస్టులు సక్రమంగా తీసుకోవాలి. ప్రతిరోజు అందిన నామినేషన్ల పై ప్రత్యేక నివేదికను సిద్ధం చేయాలని చెప్పారు. నామినేషన్లను నిర్ణీత తేదీలలో అభ్యర్థులు లేదా వారి అధికారిక ప్రతినిధుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. నామినేషన్లు తిరస్కరించే సందర్భంలో ఆ నిర్ణయాలను వెంటనే రాత పూర్వకంగా సంబంధిత అభ్యర్థికి తెలియజేయాలని, అభ్యర్థుల అప్పీళ్లకు నిబంధనల ప్రకారం తగిన సమయం ఇవ్వాలని ఎన్నికల నిర్వహణలో చిన్న పొరపాటు కూడా అధికారి బాధ్యత కిందకే వస్తుంది కాబట్టి, ప్రతి ఒక్కరూ తమ విధులను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని చెప్పారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం డబ్బు, మద్యం, ఆయుధాలు, మందుగుండు సామాగ్రి పంపిణీ చేయడం నిషేధించాలని ఆదేశించారు. దశర లేదా ఇతర పండుగల పేరుతో జరిగే ఆహార, వస్తువుల పంపిణీలను సరైన కారణం లేకుండా అనుమతించరాదని తెలిపారు. నగదు రూపంలో గరిష్టంగా రూ. 50,000 వరకు మాత్రమే తీసుకెళ్లడానికి అనుమతి ఉందని చెప్పారు. బహుమతుల రూపములో రూ. 10,000 కంటే ఎక్కువ విలువైన బహుమతులు ఎవరూ ఎవరికీ ఇవ్వకూడదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలు, బలహీన వర్గాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను, అలాగే కొద్ది మంది ఆధిపత్య వర్గాలు ఓటు వేయకుండా అడ్డుకునే ప్రాంతాలను "సున్నితమైన క్లస్టర్లు" గా గుర్తించాలని చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలలో ఒక ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఒక వీడియో గ్రాఫర్, ఒక పోలీస్ ఆఫీసర్ ఉంటారని చెప్పారు. లాటరీ సిస్టమ్ లేదా బెదిరింపులు జరిగే ప్రాంతాలకు తక్షణమే వెళ్లి అడ్డు కోవాలని , బాధితులకు భరోసా కల్పించాలని, ఎస్ఎస్టి (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్)వాహనాలు, స్టేషనరీ తనిఖీలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ కేంద్రం వద్ద ఆర్ఓ కోసం ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఉండాలన్నారు. ఫస్ట్, ఎస్ఎస్ నివేదికలు, ఎంసీసీ ఉల్లంఘనలు, ప్రతిరోజు జరిగే నామినేషన్ల వివరాలు ప్రతిరోజూ సాయంత్రం 5:00 నుండి 6:00 గంటల లోపు ఆర్ఓ కార్యాలయానికి చేరాలని, ఎటువంటి జాప్యం ఉండకూడదని ఈ మొత్తం కార్యకలాపాలను జాయింట్ కలెక్టర్ సమన్వయం చేస్తారని తెలిపారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా, ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా జరిగే క్యాంపెయిన్లను నిశితంగా పరిశీలించాలని చెప్పారు. సోషల్ మీడియా ప్రచారాలు, పెయిడ్ న్యూస్ కు అయ్యే ప్రతి ఖర్చును అభ్యర్థుల ఎలక్షన్ ఖర్చు కింద కచ్చితంగా బుకింగ్ చేయాలని చెప్పారు. సాంకేతికత టెక్నాలజీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ, ప్రతిరోజూ కలెక్టరేట్‌కు నివేదికలు పంపేలా ప్రత్యేక టీమ్ పనిచేయాలని చెప్పారు. పేపర్ బ్యాలెట్ విధానంలో ఒక ఓటరు ప్రక్రియను పూర్తి చేయడానికి సుమారు 45 సెకండ్లు పడుతుందని, గంటకు 60 నుండి 100 మంది ఓటర్లు సక్రమంగా ఓటు వేసేలా కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ ఉండాలని, అలాగే ప్రతి గంటకూ నివేదికను పంపడంలో మరియు అధికారులు అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యమని చెప్పారు. రూట్ మరియు జోనల్ అధికారులు సమర్థవంతంగా వ్యవహరిస్తే రీ-పోలింగ్ జరిగే అవకాశం ఉండదని ప్రిసైడింగ్ అధికారులు తమ విధులను స్పష్టంగా తెలుసుకొని నిర్వర్తించాలని, బ్యాలెట్ బాక్సులను భద్రపరచి కేంద్రానికి సురక్షితంగా అందజేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగకుండా చూడాలని ఆదేశించారు.

ఓట్ల లెక్కింపు కోసం తగినన్ని కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయాలని, రౌండ్ వారీగా ఫలితాలను త్వరగా వెల్లడించడం ద్వారా అభ్యర్థుల ఉత్కంఠను, ఉద్రిక్తతలను తగ్గించవచ్చుని, బ్యాలెట్ బాక్సుల విభజన, లెక్కింపు ప్రక్రియను ఎటువంటి పొరపాట్లు లేకుండా నీట్ గా పూర్తి చేయాలని చెప్పారు. నామినేషన్లు స్వీకరించి అభ్యర్థులను కాన్‌స్టిట్యూయన్సీకి తిరిగి కేటాయించే రిటర్నింగ్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని. బ్యాలెట్ బాక్సులు, స్టాట్యూటరీ, నాన్-స్టాట్యుటరీ పత్రాలను పద్ధతిగా సీల్ చేసి అందజేయాలని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, ఎంపీడీవో లు, యమ్. ఆర్. ఓ లు , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు.





**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 17:** గ్రామం లోని బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పరవాడ మండల మాజీ ఎంపీపీ పయిల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు గ్రామ ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరి పై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. బొంకులదిబ్బ యూత్ సభ్యులు సమష్టిగా కృషి చేస్తూ నవరాత్రి మహోత్సవాలను నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పరవాడ తాజా మాజీ సర్పంచ్ సిరిపురపు అప్పల నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి చుక్క రాము నాయుడు, మాజీ సర్పంచ్ పయిల అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస రావు, పయిల రామచంద్ర రావు, పయిల పోతు నాయుడు, కుంద్రాపు సోము నాయుడు, పయిల అప్పల నాయుడు, పయిల అప్పారావు, పయిల హరీష్, పయిల వెంకటరావు, బొంకులదిబ్బ యూత్ సభ్యులు, వి.ఐ. పి బాయ్స్, నూకాంబిక యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గంటాను కలిసిన మేయర్ అభ్యర్థి శ్రావణి.



**భీమిలి, పెన్ సత్తా, అక్టోబర్ 17:** ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును విశాఖ మేయర్ కూటమి అభ్యర్థి ముక్కా శ్రావణి కలిశారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసిన ఆమెను గంటా శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కూటమికి ఈ ఎన్నికల్లో అఖండ విజయం ఖాయమన్నారు.

## ఎన్నికల కోడ్ ముగిసే వరకు పీజీఆర్ఎస్ రద్దు కలెక్టర్.

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు లోకి.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 17:** అనకాపల్లి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు లోకి వచ్చిన నేపథ్యంలో, జిల్లా లోని ప్రభుత్వ శాఖలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని డిసెంబర్ 3 వ తేదీ వరకు నిర్వహించడం జరగదని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలు, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) ఎన్నికలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జడ్పీటీసీ) ఎన్నికలు, గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నందున, అదే విధంగా 14.10.2026 నుంచి 03.12.2026 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేయబడినట్లు కలెక్టర్ తెలియజేశారు.

## యలమంచిలిలో వైఎస్సార్‌సీపీ భారీ నామినేషన్ ర్యాలీ.

బొద్దపు తులసి--ఎర్రయ్య దొర నామినేషన్ దాఖలు.



**యలమంచిలి, పెన్ సత్తా, అక్టోబర్ 17:** యలమంచిలి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బొద్దపు తులసి--ఎర్రయ్య దొర వైఎస్సార్‌సీపీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొడ్డెడ ప్రసాద్, యలమంచిలి నియోజకవర్గ పరిశీలకులు కోలా గురువులు సమక్షంలో నామినేషన్ ప్రక్రియ పూర్తయింది. కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. యలమంచిలి లోని పార్టీ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## భద్రకాళి దేవిగా కన్యకా పరమేశ్వరి



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 17:** పట్టణంలో ప్రసిద్ధి చెందిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా = శనివారం అమ్మవారు భద్రకాళి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మండపంలో బేడసేవ, శ్రీ చక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి, శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుతరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

## రైతులందరూ ప్రతి వర్షపు చుక్కను ఒడిసి పట్టాలి.

- తేమను భూమి మీద ఉంచే మల్చింగ్ విధానం అమలు చేయాలి
- ప్రకృతిని ఆధారంగా చేసుకుని మాత్రమే పంటలు పండించాలి
- ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులకు ప్రభుత్వం సహకరించాలి
- జె వి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ







**గోదావరి, పెన్ సత్తా, అక్టోబర్ 17:** రైతులందరూ ప్రతి వర్షపు చుక్కను ఒడిసి పట్టాలి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్విరాన్మెంటల్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపు నిచ్చారు. శనివారం ఉదయం గోదావరి జిల్లా తుని మండలం కొలిమేరు గ్రామంలో పెనుమత్స వెంకట సత్య ప్రసాద్ రాజు కు చెందిన ప్రకృతి ఆధారిత పంట పొలాలను మ్యాంగో మ్యాన్ అప్పాజీ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ ప్రసాద్ రాజు పొలంలో తేమను భూమి మీద ఉంచే మల్చింగ్ విధానం అమలు చేయడం ఆనందదాయకం అన్నారు. ఐదు అంచల విధానంలో ప్రకృతిని ఆధారంగా చేసుకుని మాత్రమే పంటలు పండించడం విశేషం అన్నారు. ప్రధానంగా అనేక రకాల పంటలు పండిస్తూ, ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ వ్యవసాయ క్షేత్రం ప్రతి రైతు సందర్శించి తెలుసుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయని వివరించారు. ఎల్ నినో, సూపర్ ఎల్ నినో లను తట్టుకునేందుకు అనువుగా ఈ వ్యవసాయ క్షేత్రం ఉందని పేర్కొన్నారు. ప్రధానంగా ఈ వ్యవసాయ క్షేత్రంలో ఇరువైపులా ఉన్న కొండల మీద నుంచి వచ్చే నీరు భూమి లోకి ఇంకెందుకు అనువుగా చతుర్విధ జల ప్రక్రియను అమలు చేశారని వివరించారు. భూమీ సారం పెంపొందించేందుకు అనేక విధానాలు అవలంబించడం విశేషంగా ఆకట్టుకున్నాయి అని పేర్కొన్నారు. ఈ విధంగా ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో పనిచేసే పదవీ విరమణ చేసిన తర్వాత వ్యవసాయ రంగంలో అడుగు పెట్టిన రాజు తన పొలంలో ఉన్నత ఫలితాలు సాధించి రైతే రాజుని నిరూపించారని ఆయన పేర్కొన్నారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండిస్తున్న రైతు పెనుమత్స వెంకట సత్య ప్రసాద్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి సహాయం లభిస్తే చాలామంది రైతులు ప్రకృతి ఆధారంగా పంటలు పండిస్తారు అని పేర్కొన్నారు. రసాయన ఎరువులు, రసాయన క్రిమిసంహారకాలు వాడటం వల్ల మానవాళికీ, ఇతర జీవావరణానికి అనేక రకాలుగా నష్టం వాటిల్లుతోందని భావించి తాను ప్రకృతి ఆధారంగా పంటలు పండిస్తున్నానని వివరించారు. మ్యాంగో మ్యాన్ అప్పాజీ మాట్లాడుతూ మామిడి పండు సాధించడానికి అనేక మేలుకువలు ప్రసాద్ రాజు కు వివరించారు.

## గంజాయి అక్రమ రవాణాదారుల పై పోలీసుల ఉక్కుపాదం.

- పాత నేరస్థుడిపై 'పిట్ ఎన్.డి.పి.ఎస్'చట్టం ప్రయోగం.
- విశాఖ సెంట్రల్ జైలుకు తరలింపు.



**పాయకరావుపేట, పెన్ సత్తా, అక్టోబర్ 17:** జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను సమూలంగా నిర్మూలించే దిశగా అనకాపల్లి జిల్లా పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. వరుసగా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న పాత నేరస్థుడి పై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 'పిట్ ఎన్.డి.పి.ఎస్' చట్టం కింద డిటెన్షన్ ఉత్తర్వులు అమలు చేసి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు.
నిందితుడి వివరాలు: పేరు: నోట్ల చిన రామకృష్ణ (వయస్సు: 24 సంవత్సరాలు, వృత్తి: ఏసీ టెక్నీషియన్) చిరునామా: డి.నం.23-260, పీనారిపాలెం, నర్సీపట్నం టౌన్. నిందితుడు అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున గంజాయిని సేకరించి, అనకాపల్లి, పొరుగు జిల్లాలకు అక్రమ రవాణా చేస్తూ విద్యార్థులు, యువతకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఇతని పై గతంలో నమోదైన కేసులు పాయకరావుపేట, కోటనందూరు, కొయ్యూరు పోలీస్ స్టేషన్ లలో కేసులు వున్నాయి. ఇతని పై మొత్తం 1,100 కేజీలకు పైగా గంజాయి అక్రమ రవాణా కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉంటూ, బెయిల్ పై బయటకు వచ్చి మళ్లీ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. దీని పై స్పందించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (రెవెన్యూ/ఎక్సైజ్ శాఖ) జి.ఓ.ఆర్టీ నం. 1006 ద్వారా నిందితుడిపై ఫిట్ ఎన్డిపిఎస్ చట్టం కింద డిటెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ?పాయకరావుపేట సీఐ వినోద్ బాబు, జిల్లా ఎన్.డి.పి.ఎస్ (ఎన్డిపిఎస్) సెల్ సీఐ పిల్లా రమేష్, పాయకరావుపేట ఎస్సై పురుషోత్తంల ఆధ్వర్యంలో పోలీసు బృందం ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిందితుడిని అదుపు లోకి తీసుకుంది. అనంతరం పటిష్ట భద్రత నడుమ విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించి అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేస్తూ, సమాజ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న గంజాయి ముఠాల పై జిల్లా పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. ముఖ్యంగా కళాశాలల సమీపంలో విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్న వారి పై ప్రత్యేక నిఘా ఉంచాం. కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా, పదే పదే నేరాలకు పాల్పడే అలవాటున్న నేరస్థుల పై కఠిన మైన 'పిట్ ఎన్.డి.పి.ఎస్' (ఫిట్ ఎన్డిపిఎస్) చట్టం అమలు చేస్తాం. గంజాయి రవాణా, నిల్వ లేదా విక్రయాల్లో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ భాగస్వాములయ్యే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదు. జిల్లాను మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు ప్రజలు, యువత పోలీసులకు సహకరించాలని, గంజాయి సమాచారం తెలిస్తే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు అందించాలని కోరుతున్నాం. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయి అని తెలిపారు.

# జలాశయాల పరి రక్షణ మనందరి బాధ్యత.






**నీటి కాలుష్యాన్ని అరికట్టేందుకు సమష్టి కృషి అవసరం.**

**రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు.**

**సింహాద్రి టీఎంటీ ఆధ్వర్యంలో మేఘాద్రి గెడ్డ జలాశయ శుభ్రత కార్యక్రమం.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 17:** మనకు జీవనాధార మైన జలవనరులను పరి రక్షించు కోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు పిలుపునిచ్చారు. జలాశయాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయనాలు, చెత్తాచెదారం వేయడం వల్ల తాగునీరు కలుషితమవడంతోపాటు, జలచరాల మనుగడకు ముప్పు ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖపట్నం లోని మేఘాద్రి గెడ్డ జలాశయం (డ్యామ్) లోపల, చుట్టుపక్కల పరిసరాల్లో శనివారం సింహాద్రి టీఎంటీ, హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్, స్థానిక యువత ఆధ్వర్యంలో జలాశయ శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు మాట్లాడుతూ నీరు లేనిదే జీవం లేదనే ఉన్నత ఆశయంతో మన పూర్వీకులు నదులను, జలాశయాలను పవిత్ర మైన క్షేత్రాలుగా భావించి గౌరవించేవారని గుర్తు చేశారు. నీరు లేనిదే జీవం లేదు. మనకు జీవనాధార మైన తాగునీటిని అందించే జలాశయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత. వాటిని ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయనాలు, చెత్తాచెదారంతో కలుషితం చేయడం వల్ల ప్రజల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం కలుగుతుంది" అని పి.ఎస్. నాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతం జలవనరుల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయనాలు, ఇతర చెత్తాచెదారం కారణంగా తాగునీరు కలుషితమై ప్రజలు అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. నీటిలో నివసించే జీవులు కూడా కాలుష్యం కారణంగా ప్రాణాలు కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జలాశయాలను పరిశుభ్రంగా ఉంచడం, వాటిలో వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించడం అత్యవసరమని అన్నారు. జలవనరుల పరి రక్షణను ప్రభుత్వాలకే పరిమితం చేయకుండా, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఆయన పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, యువత, స్థానిక ప్రజలు కలిసి పనిచేస్తే జలాశయాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, భవిష్యత్ తరాలకు సురక్షితమైన నీటి వనరులను అందించవచ్చని పేర్కొన్నారు. జలాశయంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త తొలగింపు.

ఈ సందర్భంగా హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్, సింహాద్రి టీఎంటీ సభ్యులు, స్థానిక యువత, స్వచ్ఛంద సేవకులు మేఘాద్రి గెడ్డ జలాశయంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు, చెత్తను బయటకు తీసి జలాశయం లోపల, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణకు అంకితభావంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువతను ఈ సందర్భంగా అభినందించారు. జలాశయ పరిశుభ్రతను ఒక్కరోజు కార్యక్రమానికే పరిమితం చేయకుండా, ప్రతి నెలా ఒకసారి మేఘాద్రి గెడ్డ జలాశయాన్ని శుభ్రపరిచేందుకు తమ సంస్థ సభ్యులు కృషి చేస్తారని హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్, సింహాద్రి టీఎంటీ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులోనూ పర్యావరణ పరి రక్షణ, జలవనరుల పరిశుభ్రతకు సంబంధించి ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రముఖులు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవకుల భాగస్వామ్యం. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా రిటైర్డ్ ప్రత్యేక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పైలా సన్నీ బాబు, నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ సభ్యులు భరణి కాన రామారావు, టి.వి.డి. దాస్, ఫరూక్ ఆర్.వి.కె. నాయుడు పాల్గొన్నారు. డాబాగార్డెన్స్ ఆదిత్య డిగ్రీ కాలేజీ ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు, స్థానిక యువత, స్వచ్ఛంద సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జలాశయ శుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కూటమి అభ్యర్థి పద్మావతి గెలుపు తోనే నర్సీపట్నం అభివృద్ధి.

- గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి సూన్యం. ?
- కరపత్రాల ద్వారా కూటమి అభివృద్ధి పనుల వివరణ.
- రెండున్నర ఏళ్లలోనే రూ. 267.70 కోట్ల నిధులు తెచ్చిన అయ్యన్నపాత్రుడు.
- రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ మీడియా సమావేశం.




**నర్సీపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 17:** నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థిగా ఎన్డీయే కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) బలపర్చిన చింతకాయల పద్మావతిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ ఓటర్లకు పిలుపు నిచ్చారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ, మంత్రి నారా లోకేష్ ల నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎంతో ఐక్యంగా ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, భవిష్యత్తులో చేయబోయే ప్రణాళికలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని విజయ్ విలేకరులకు చూపించారు. పద్మావతి గతంలో కౌన్సిలర్ గా ఉండి, ప్రజల సమస్యల పై అవగాహన ఉన్న నాయకురాలని, ఆమె చైర్ పర్సన్ అయితే నర్సీపట్నం రూపురేఖలు మారతాయని ధీమా వ్యక్తం చేశారు. అయ్యన్న పాత్రుడి కుటుంబం దశాబ్దాలుగా ప్రజల సేవలోనే ఉందని, 'అన్నపూర్ణ అక్షయపాత్ర' ద్వారా సుమారు లక్ష మందికి పైగా అన్నదానం చేశామని గుర్తుచేశారు. ఎంపీగా తన దృష్టికి వచ్చిన వెంటనే ఎంపీ నిధులు మంజూరు చేస్తున్నానని, గచ్చపు వీధి కళ్యాణ మండపం, మినరల్ వాటర్ ప్లాంట్లు వంటివి ఏర్పాటు చేశామని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నర్సీపట్నంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కనీసం రోడ్లు, డ్రైనేజీలు కూడా నిర్మించలేదని ఆయన విమర్శించారు. నాడు గంజాయి వ్యాపారాలు, టిక్కెట్ల అమ్మకాలతో కాలం గడిపిన వైసీపీ నాయకులకు, నేడు మున్సిపల్ ఎన్నికల్లో వార్డులకు అభ్యర్థులను నిలబెట్టే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే గంజాయి అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపామని, అక్రమ కట్టడాలను ఉపేక్షించకుండా కూల్చివేస్తున్నామని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ నూరు శాతం 'స్ట్రైక్ రేట్' సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని విజయ్ తెలిపారు. జనసేన పార్టీ నర్సీపట్నం ఇంఛార్జిగా సూర్యచంద్రరావు ఉన్నారని, ఆయన పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. ?కేవలం రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే మంత్రి అయ్యన్న పాత్రుడు నర్సీపట్నం అభివృద్ధి కోసం రూ. 267.70 కోట్ల నిధులు మంజూరు చేయించారని విజయ్ వివరించారు. అక్టోబర్ 28న జరిగే ఎన్నికల్లో ఓటర్లు సైకిల్ గుర్తుపై ఓటు వేసి చింతకాయల పద్మావతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. రాబోయే రోజుల్లో నర్సీపట్నంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మెరుగుపరచి, భావితరాలకు (నెక్స్ట్ జనరేషన్ కు) ఆదర్శవంత మైన పట్టణంగా తీర్చిదిద్దుతామని చింతకాయల విజయ్ హామీ ఇచ్చారు.

# పరిషత్తు ఎన్నికలను నిబద్ధత తో నిర్వహించాలి.

**ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రతి ఒక్కరూ చదవాలి, వాటినే పాటించాలి.**

**ఏర్పాట్ల పై సమీక్షించిన కలెక్టర్ ఎం .అభిషిక్త్ కిశోర్**




**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబరు 17:** ఎం.పి.టి.సి, జెడ్.పి.టి.సి ఎన్నికల విధులను నిబద్ధతతో నిర్వహించాలని, ఎన్నికలకు సంబంధించిన ప్రతి పనిలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలనే పాటించాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ అధికారులకు ఆదేశించారు. ప్రతి ఒక్కరూ నిబంధనావళిని క్షుణ్ణంగా చదువుకుని వారికి కేటాయించిన విధులను నిర్వర్తించాలన్నారు. శనివారం నగర పోలీస్ కమిషనర్ తో కలసి కలెక్టర్ పరిషత్తు ఎన్నికల ఏర్పాట్ల పై నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీటీసి, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 19 న వెలువడుతుందని, 4 జడ్పీటీసీ, 53 ఎంపీటీసీ స్థనాలకు నామినేషన్ల స్వీకరణ ఈ నెల 21 వ తేదీ నుండి 23 వరకు స్వీకరించడం జరుగుతుందని, ఎన్నికలు నవంబర్ 3 న, ఓట్ల లెక్కింపు 5 వ తేదీన జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించుటకు గానూ నోడల్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. డివిజనల్ స్థాయి లో ఆర్.డి. ఓ లు ఇంచార్జ్ లుగా వుంటారని, అసిస్టెంట్ అథారిటీ గా ఎం.పి.డి. ఓ లు వ్యవహరిస్తారని తెలిపారు. 203 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడ మైందని, ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద కనీస వసతులు ఉండేలా చూడాలని సూచించారు. మోడల్ కోడ్ వెంటనే అమలు లోకి వస్తుందని, పార్టీల ప్రతినిధుల ఫోటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని తెలిపారు. మోడల్ కోడ్ అమలు బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల సామాగ్రిని సమకూర్చుకోవాలని, పోలింగ్ అధికారులకు, సిబ్బందికి శిక్షణలు పూర్తి చేయాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఇతర ఎన్నికల సామాగ్రిని ఆయా నోడల్ అధికారులు సమకూర్చుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ అధికారులు చూడాలన్నారు. నగర కమిషనర్ శంఖబత్ర బాక్చి మాట్లాడుతూ 203 పోలింగ్ స్టేషన్ల కోసం 6607 మందిని పోలీస్ శాఖ నుండి బందోబస్తు కోసం నియమించడం జరిగిందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ల ద్వారా కూడా పటిష్టమైన ఏర్పాట్లను చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జెసి విద్యాధరి, డి.ఆర్.ఓ విశ్వేశ్వర నాయుడు, జిల్లా పరిషత్ సి.ఈ. ఓ నారాయణమూర్తి, డిప్యూటీ సి.ఈ. ఓ సందీప్, ఆర్.డి.ఓలు దిలీప్ చక్రవర్తి, మాధుర్, డి.ఈ. ఓ ప్రేమ్ కుమార్, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల నిర్వహణ పై పి ఓ, ఏపీవో లకు స్పష్టమైన అవగాహన ఉండాలి.





- గాజువాక జోన్‌లో పి ఓ, ఏ పీ ఓ ల శిక్షణ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలించిన
- జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్.

**గాజువాక, పెన్ సత్తా, అక్టోబర్ 17:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి తమ బాధ్యతల పై పూర్తి అవగాహన ఉండాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం ఆయన గాజువాక లోని బి హెచ్ ఈ ఎల్ సంసిద్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన పిఓ , ఏపీవో ల శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి సిబ్బందికి అందిస్తున్న శిక్షణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులకు నియమితు లైన పిఓ లు, ఏపీవోలు తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో అర్థం చేసుకోవాలని, ఎన్నికల నియమావళి, విధివిధానాల పై స్పష్ట మైన అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విధుల నిర్వహణలో రాజకీయాలకతీతంగా ఉండడంతోపాటు సమయపాలన, క్రమశిక్షణ, ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌ను, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కమిషనర్ పరిశీలించి, అక్కడ చేపట్టిన ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎన్నికలకు సంబంధించిన సామగ్రి భద్రత, కేంద్రాల నిర్వహణ, అవసర మైన మౌలిక సదుపాయాలు, సిబ్బందికి కల్పిస్తున్న సౌకర్యాల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ కె. రమేష్, జోనల్ కమిషనర్ శేషాద్రి, రిటర్నింగ్ అధికారి మధులత, ఏసీపీ వెంకట్రావు, పర్యవేక్షక ఇంజనీర్ రాయల్ బాబు, ఏ ఎం ఓ హెచ్ కిరణ్, ఏపీడీ తదితర అధికారులు పాల్గొన్నారు.

# దసరా సందర్భంగా ద్వారకా బస్ స్టేషన్‌లో పార్సిల్ బుకింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు.



క్యూఆర్ కోడ్ విధానం ద్వారా నిమిషంలోనే పార్సిల్ బుకింగ్‌కు చర్యలు.

**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 17:** దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులకు, పార్సిల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ద్వారకా బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పార్సిల్ బుకింగ్ విభాగాన్ని ఏపీఎస్‌ఆర్టీసీ విశాఖపట్నం రీజనల్ మేనేజర్ బి. అప్పల నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని పార్సిల్ బుకింగ్‌లో జాప్యం లేకుండా, వినియోగదారులు క్యూలలో ఎక్కువసేపు వేచి ఉండకుండా ప్రత్యేక కౌంటర్ ద్వారా వేగవంతమైన సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. క్యూఆర్ కోడ్ విధానం ద్వారా పార్సిల్ వివరాలు, వినియోగదారుల ఫోన్ నంబర్లను నమోదు చేసి, అవసర మైన ఫొటో ను కౌంటర్ వద్ద తీసుకున్న అనంతరం సుమారు ఒక నిమిషం లోనే పార్సిల్ బుకింగ్ పూర్తి చేసి రసీదు అందించే విధంగా చర్యలు చేపట్టారు. ఈ విధానం పై పార్సిల్ బుకింగ్‌కు వచ్చిన వినియోగదారులకు అధికారులు అవగాహన కల్పించారు. అదే విధంగా, దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈరోజు సుమారు 70 ప్రత్యేక బస్సులను నడిపారు. వీటిలో హైదరాబాద్‌కు 2, విజయవాడకు 18, శ్రీకాకుళానికి 40, పార్వతీపురం, రాజాం ప్రాంతాలకు 10 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి ప్రయాణికులకు రవాణా సౌకర్యం కల్పించారు. ఈ తనిఖీల్లో జోనల్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) ఎం. సుధా బిందు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, ఏటీఎం కె.గంగాధర్, సింహాచలం డిపో మేనేజర్ హనుమశ్రీ, అకౌంట్స్ ఆఫీసర్ కుమారి వి.వంశీ మోహిని, తదితర అధికారులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయ ఆధునీకరణ.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 17:** గౌరీ పంచాయతన దేవాలయంలో అయ్యప్ప స్వామి ఆలయ ఆధునీకరణ ప్రారంభోత్సవం మహోత్సవంలో భాగంగా శనివారం ఆలయంలో పొందూరు సూర్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో వేద పారాయణం, మండప అర్చన, సూర్య నమస్కారాలు, అయ్యప్ప మూల మంత్ర హోమములు, మహాశివుడికి పంచామృత అభిషేకాలు, నేరదులో మంత్రపుష్పం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, మద్దాల నారాయణ రావు, పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

## మహాలక్ష్మి దేవి గా దుర్గమ్మ



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 17:** ప్రసిద్ధి చెందిన గవరపాలెం శతకం పట్టు లో కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి మహోత్సవంలో భాగంగ శనివారం మహాలక్ష్మి దేవిగా అలంకరణ చేసారు. ఈ అలంకరణ ఉదయగిరి చంద్రశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు కే హరినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారికి నిత్య పూజ్యులు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద విల్లూరి నానాజీ మాధురి లక్ష్మి, కర్రి వెంకటరమణ బాబు లక్ష్మీ తులసి దంపతులు ఆర్థిక సహాయంతో విద్యార్థులకు, పారిశుద్ధ కార్మికులకు (బుక్స్, బట్టలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు). ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు అండ్ బ్రదర్స్ ఆర్థిక సహకారంతో మాల ధారణ చేసిన భవానీ భక్తులకు నవరాత్రి పది రోజులు అన్న సమారాధన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, దాడి కృష్ణ, గండేపల్లి మురళి, పివి సత్యనారాయణ, దాడి అప్పల నాయుడు, పీలా శ్రీనివాసరావు, పెంటకోట గాంధీ, యల్లపు వాసు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కామాక్షి దేవి ఆలయంలో కుంకుమ పూజలు.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 17:** నిదానం దొడ్డి లో వేంచేసియున్న కామాక్షి దేవి దసరా నవరాత్రి మహోత్సవాలు భాగంగా శనివారంఅమ్మవారు భక్తులకు మహిషాసుర మర్దినిదేవి గాభక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద స్వర్ణ హస్త కంకణ సన్మాన గ్రహీత సప్పాభారతి భగవతారిణిగారి చే మధ్విరాజ్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర హరికథ గానం భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పట్టణ సంఘం అధ్యక్షులు పొన్నాడ వెంకట సత్యనరసింహ ఆచారి (పెదబాబు), ప్రధాన కార్యదర్శి యండపల్లి మోహన్ బ్రహ్మాజీ, కోశాధికారి కిల్లాడ శ్రీనివాసరావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు వెదురుపాటి సుందరయ్య (బాబి), పట్టణ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సి.పి.ఎం 106 వ వార్డు జీవీఎంసీ అభ్యర్థి గా బొద్దపు. శ్రీనివాసరావు నామినేషన్.

**-శ్రీనివాసరావును అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని సిపిఎం పార్టీ**




**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 17:** శనివారం విశాఖ జీవీఎంసీ ఎన్నికలలో సి.పి.ఎం పార్టీ నుండి 106 వ వార్డు అభ్యర్థి గా శ్రీనివాస రావు నామినేషన్ దాఖలు చేశారు. శ్రీనివాసరావు కార్మిక సంఘ నాయకుడిగా, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. అనేక సంవత్సరాలుగా కార్మిక, ప్రజా సమస్యల పై పనిచేస్తున్నారు, బొగ్గ



దూళి లారీలు సమస్యల పైన, ఫార్మా కాలుష్యం పై, తాడి గ్రామం తరలింపు పైన, కార్మిక హక్కులు సమస్యల పై అనేక ప్రజా ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించారు. నిరంతరం ప్రజా సమస్యల పై పని చేసే శ్రీనివాసరావును 106 వ వార్డు నుండి గెలిపించి జీవీఎంసీ కౌన్సిల్ కి పంపించినట్లయితే ప్రజల గొంతుక వినిపిస్తారన్నారు. తాడి తరలింపు కోసం, లంకెలపాలెంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం బ్రిడ్జి నిర్మాణం, ఫార్మా కాలుష్యం పైన కార్మిక సమస్యల పైన పనిచేస్తానని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, అప్పికొండ గోవిందా, మణికంఠ, జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, దేశపాత్రునిపాలెం మాజీ ఉపసర్పంచ్ వివి రమణ,ఎస్ కే నజీర్, కే వెంకట్రావు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ అభ్యర్థినిగా నామినేషన్ వేసిన వరుదు కళ్యాణి.





**విసుఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 17:** జీవీఎంసీ మేయర్ అభ్యర్థినిగా శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి శనివారం అట్ట హాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఆమె ముందుగా సంపత్ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఎల్ఐసి జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడ నుండి జీవీఎంసీ కార్యాలయం వరకు వైసీపీ నాయకులు కార్యకర్తలుతో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కో ఆర్డినేటర్లు కురుసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు, మాజీ పార్లమెంటు సభ్యురాలు బీశెట్టి సత్యవతి, విశాఖ పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు, నియోజకవర్గ సమన్వయకర్తలు మళ్ళ విజయ ప్రసాద్, వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, బొత్స అనూష, మాజీ మేయర్ గోలగాని హరివెంకట కుమారి, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు, విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిశీలకులు పేడాడ రమణి కుమారి, ఇతర నాయకులు తో కలసి పాల్గొన్నారు.

## దుర్గమ్మ కు కనకమహాలక్ష్మి దేవస్థానం తరపున పట్టు వస్త్రములు.





**విజయవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 17:** ఇంద్ర కీలాద్రి పై వెంచేసి యున్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నందు కనక దుర్గ అమ్మ వారి శరన్నవ రాత్రి ఉత్సవముల సందర్భంగా శనివారం ఉదయం దుర్గమ్మ కు విశాఖపట్నం బురుజుపేట నందు వెంచేసి యున్న కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం తరపున పట్టు వస్త్రములు, సాంప్రదాయ మైన సారే సమర్పించారు, 5 రకముల పళ్ళు, 5 రకముల పుష్పములు, 5 రకముల పిండి వంటలు, పట్టు వస్త్రములు మొదలగునవి నేడు సమర్పించియున్నారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణాధికారిణి కే. శోభారాణి, ధర్మకర్తలు ఎస్. రామారావు, డి. శ్రీకాంత్, ఎమ్. నాగసుధ, సి. హెచ్. మంజుల, టి. వేణికుమారి, టి. నాగమణి,కే. అనురాధ, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూకాంబిక ఆలయంలో కుంకుమ పూజలు.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 17:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భాగంగా శనివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి సహస్ర కమల అర్చన, తోమాల సేవ, హోమం నిర్వహించారు. అన్న సమారాదాన్ని విరాళం దాతలు అట్లూరి రొంగలి శ్రీనివాసరావు పద్మావతి, జగన్నాథరావు పూర్ణిమ దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాస రావు,కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం కోసం నిలబడండి



న్యాయవిద్య పూర్తి చేసుకుని వృత్తిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులపై దేశం ఎన్నో ఆశలు పెట్టుకుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ అన్నారు. న్యాయం కోసం ధైర్యంగా నిలబడాలని, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడాలని సూచించారు. వృత్తిలో నిజాయతీగా ఉంటూ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. శనివారం కర్ణాటక బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ 34వ స్నాతకోత్సవంలో సీజేఐ పాల్గొని మాట్లాడారు. న్యాయవిద్య అంటే చట్టాలను చదివి తెలుసుకోవడం మాత్రమే కాదని చెప్పారు. విభిన్న అభిప్రాయాలను అర్థం చేసుకోవడం, సమాజానికి సేవ చేయడం కూడా అందులో భాగమని వివరించారు. న్యాయవిద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూనే, వారి నుంచి ఎన్నో ఆశిస్తున్నానని సూర్యకాంత్ అన్నారు. చట్టాలపై అవగాహన ఉండటంతో పాటు, న్యాయం కోసం నిలబడే ధైర్యం కూడా న్యాయవాదులకు ఉండాలని చెప్పారు. తమ సమస్యలను చెప్పుకోలేని వారి మాటలను కూడా ఓపికగా వినాలని సూచించారు. న్యాయవృత్తి అంత సులభమైనది కాదని సీజేఐ అన్నారు. చట్టాలు, గత తీర్పులపై పట్టు సాధించడంతో పాటు, సరైన విషయాల కోసం ధైర్యంగా పోరాడాలని చెప్పారు. ఇతరుల బాధలను అర్థం చేసుకునే గుణం కూడా ఉండాలని సూచించారు. వృత్తిలో సౌలభ్యం కోసం తమ సూత్రాలను పక్కన పెట్టకూడదని, సులభమైన మార్గాల కోసం తప్పు నిర్ణయాలు తీసుకోకూడదని విద్యార్థులకు సూచించారు. చదువుకున్న విద్యాసంస్థలో నేర్చుకున్న విలువలను జీవితాంతం గుర్తుంచుకోవాలని చెప్పారు. న్యాయవాద వృత్తి ద్వారా సమాజంలో ఎన్నో మార్పులు తీసుకురావచ్చని సూర్యకాంత్ తెలిపారు. అన్యాయానికి గురైన వారికి న్యాయం చేయడం, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడటం, రాజ్యాంగాన్ని గౌరవించడం ద్వారా ఎంతో సంతృప్తి పొందవచ్చని అన్నారు. విద్యార్థులు న్యాయవాదులుగా తమ బాధ్యతలను నిర్వర్తించడానికే పరిమితం కాకూడదని సీజేఐ సూచించారు. దేశానికి, సమాజానికి కూడా తమ వంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు. న్యాయవిద్య పూర్తి చేసుకుని బయటకు వెళు్తన్న విద్యార్థులు కేవలం చట్టపరమైన విషయాల్లోనే కాకుండా, ప్రజల్లో ఆశలు నింపే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. "న్యాయవాద వృత్తి పిరికివారి కోసం కాదు. చట్టాలు, న్యాయస్థానలు గతంలో ఇచ్చిన తీర్పులపై పట్టు ఉండడం మాత్రమే సరిపోదు. న్యాయమైన దానిని సమర్థించే ధైర్యం, నిజాయితీ ఉండాలి. న్యాయవాదులకు మేధస్సు ఉంటే సరిపోదు. నిష్పాక్షికత కూడా అవసరం. ఇతరుల వాదనలు వినాలి. ఎదుటి వ్యక్తి గౌరవాన్ని కించపరచకుండానే వారితో విభేదించగలగాలి. నైతిక బాధ్యత కలిగి ఉండాలి. అంతేకాదు ఎంతటి ఒత్తిడినైనా తట్టుకొని స్థిరంగా నిలబడగలగాలి. వృత్తి జీవితంలో ఎక్కడా రాజీపడకూడదు. విలువలకు కట్టుబడి ఉండాలి. నిజాయితీగా ఉంటేనే ఈ వృత్తిలో కీర్తి సుస్థిరంగా ఉంటుంది. రాజీపడాలనే ఆలోచనలు, ప్రలోభాలు, స్వప్రయోజనాలను విడిచిపెట్టాలి. ఒకవేళ అలాంటి సందర్భాలు ఎదురైతే లా కాలేజీల్లో నేర్పిన జ్ఞానాన్నే మీ దిక్సూచిగా చేసుకొని, మీరు ఇక్కడ నేర్చుకున్న విలువలకు కట్టుబడి ఉంటాలి. మీరు ఈ విద్యాలయం నుంచి బయటకు వెళ్తున్నప్పుడు, కేవలం ఒక వృత్తిలోకి వెళ్లడం లేదు. స్వయంప్రతిపత్తికి సంరక్షకులుగా, ప్రజల సేవకులుగా వెళు్తన్నారు. చట్టం మీ సహనాన్ని, నైతికతను పరీక్షిస్తుంది. కానీ తప్పులను సరిదిద్దడం, స్వేచ్ఛను పరిరక్షించడం, రాజ్యాంగాన్ని నిలబెట్టడం మొదలైనవి మీకు సంతృప్తిని అందిస్తాయి."

### ఆ విద్యార్థినికి నివాళులు

ఈ స్నాతకోత్సవంలో దివంగత ఊర్వశి కృష్ణత్రాకు సీజేఐ సూర్యకాంత్ నివాళులు అర్పించారు. ఆమె తన ఎల్ఎల్బీ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ పొందడానికి ముందే మరణించారు. "ఆమె ఈ రోజు ఇక్కడ ఉండి ఉంటే, ఈ డిగ్రీని అందుకుంటూ, తను సాధించిన డిగ్రీ గురించి తన సహచరులతో పంచుకునేది" అంటూ ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సీజేఐ తన సంతాపం తెలియజేశారు. గ్రాడ్యుయేట్లను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది పాత్రను ఈ సందర్భంగా సీజేఐ గుర్తుచేశారు. విద్యార్థుల విజయాలు వారి కుటుంబాల త్యాగాలు, మద్దతు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని ప్రతిబింబిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. "మీరు ఈ ప్రపంచంలోకి అడుగుపెడు తున్నప్పుడు, దేశం మిమ్మల్ని కేవలం న్యాయవాదులుగానే కాకుండా, ఆశాకిరణాలుగా చూస్తుంది. అందువల్ల మీ వృత్తి జీవితంగా ఉజ్వలంగా, మీ ప్రయత్నాలు ప్రభావవంతంగా, మీ సేవలు శాశ్వతంగా నిలవాలని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు.

# నిలకడగా అడ్వాణీ ఆరోగ్యం

## హెల్త్ బులిటెన్ విడుదల చేసిన ఆసుపత్రి



ఛాతీ ఇన్ఫెక్షన్తో ఆసుపత్రిలో చేరిన బీజేపీ అగ్రనేత, మాజీ ఉపప్రధానమంత్రి ఎల్?కే అడ్వాణీ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని దిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందిస్తున్నామని తెలిపాయి. శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థకు గురైన అడ్వాణీని ఆసుపత్రికి తీసుకొచ్చినట్లు ఆయన కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం ఆయన న్యూరాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్నారని ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది.

98 ఏళ్ల వయసున్న అడ్వాణీ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ ఏడాది మేలో కూడా వయో సంబంధిత సమస్యలతో ఆయన ఇదే ఆసుపత్రిలో చేరారు. అప్పట్లో కొన్ని రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవను పూర్తి చేసుకున్న సందర్భంగా అడ్వాణీ నివాసానికి వెళ్లి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మోదీతో అప్యాయంగా మాట్లాడిన అడ్వాణీ కొద్ది రోజుల వ్యవధిలోనే మళ్లీ ఆసుపత్రిలో చేరారు. అయితే, అడ్వాణీ హెల్త్? కండీషన్? గురించి తెలుసుకున్న పలువురు రాజీకీయ నేతలు, ఆయన అభిమానులు అడ్వాణీ త్వరగా కోలుకోవాలని, పూర్తి ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నారు.

### బీజేపీ వ్యవస్థాపక నేతల్లో ఒకరు

ఎల్కే అడ్వాణీ పూర్తి పేరు లాల్కృష్ణ అడ్వాణీ. దేశ రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు కీలక పాత్ర పోషించారు. అంతేకాదు, కేంద్రంలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చరిత్రలోనే అత్యంత ప్రముఖమైన అగ్ర నాయకుల్లో ఒకరిగా నిలిచారు. ప్రారంభంలో ఒక చిన్న రాజకీయ శక్తిగా ఉన్న బీజేపీని, దేశంలోనే అధికార పీఠాన్ని కైవసం చేసుకునే స్థాయికి చేర్చడంలో ఆయన పోషించిన పాత్ర కీలకం.

1927 నవంబర్ 8న ఉమ్మడి భారతదేశంలోని కరాచీ (ప్రస్తుతం పాకిస్థాన్?లో ఉంది) నగరంలో జన్మించిన అడ్వాణీ, చిన్న వయసులోనే దేశ విభజన తర్వాత భారతదేశానికి వలస వచ్చారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (=ూూ) ద్వారా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి నిబద్ధత గల నాయకుడిగా ఎదిగారు. దేశవ్యాప్తంగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని క్షేత్రస్థాయి వరకు బలోపేతం చేయడంలో అడ్వాణీ కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా 1990లో ఆయన చేపట్టిన దేశవ్యాప్త రామ రథయాత్ర భారత రాజకీయాల్లోనే ఒక చరిత్రాత్మక మలుపుగా నిలిచింది. అంతేకాదు, బీజేపీ రాజకీయ ప్రాబల్యాన్ని విస్తరించడంలో సహాయపడింది. అలా బీజేపీ చరిత్రలోనే అత్యంత ప్రముఖ నాయకుల్లో ఒకరిగా నిలిచారు.

### ఉపప్రధానిగా భాద్యతలు చేపట్టి

అలాగే, పరిపాలనా రంగంలోనూ అడ్వాణీ తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. 2002 నుంచి 2004 వరకు అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్పేయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో భారతదేశ ఉప ప్రధానమంత్రిగా అడ్వాణీ సేవలు అందించారు. తన రాజకీయ జీవితంలో ఆయన కేంద్ర హోం వ్యవహారాలతో సహా పలు కీలక బాధ్యతలు చేపట్టి, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

### భారత రత్న, పద్మ విభూషణ్ పురస్కారాలు

భారత ప్రజా జీవితానికి, దేశ ప్రగతికి అడ్వాణీ చేసిన అసాధారణ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం, దేశ అత్యున్నత పురస్కారాలతో ఆయన్ను సత్కరించింది. 2024వ సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారత రత్న'ను ప్రదానం చేసింది. అంతకుముందు, 2015లో ఆయనకు దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మ విభూషణ్' వరించింది. ప్రస్తుతం ఆయన బీజేపీలో ఒక సీనియర్? నాయకుడిగా, పార్టీ రాజకీయ చరిత్రలో కీలక వ్యక్తిగా కొనసాగుతున్నారు.

# సీఆర్పీఎఫ్ జవాన్లకు గుడ్ న్యూస్



కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగం (సీఆర్పీఎఫ్) జవాన్ల పదోన్నతుల్లో నెలకొన్న తీవ్ర జాప్యాన్ని నివారించేందుకు ఒక కీలక ప్రతిపాదనను సిద్ధం చేసింది. సుమారు మూడు దశాబ్దాల క్రితం రద్దు చేసిన 'లాన్స్ నాయక్', 'నాయక్' ర్యాంకులను తిరిగి ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, కానిస్టేబుల్ స్థాయి నుంచి పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న లక్షలాది మంది సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. ఈ ప్రతిపాదనపై సిబ్బంది అభిప్రాయాలను సేకరించేందుకు సీఆర్పీఎఫ్ ప్రధాన కార్యాలయం తక్షణ చర్యలు చేపట్టింది. కేవలం రెండు రోజుల్లో వ్యవధిలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని యూనిట్లలో 'సైనిక్ సమ్మేళన్'లు నిర్వహించి, జవాన్ల ఫీడ్బ్యాక్ సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది. దాదాపు 3.25 లక్షల మంది సిబ్బంది కలిగిన సీఆర్పీఎఫ్లో ఈ ప్రతిపాదనపై ప్రస్తుతం విస్తృతస్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం సీఆర్పీఎఫ్లో ఒక కానిస్టేబుల్ తన మొదటి పదోన్నతిని (హెడ్ కానిస్టేబుల్గా) అందుకోవడానికి సగటున 22 నుంచి 25 ఏళ్ల సమయం పడుతోంది. ఈ సుదీర్ఘ నిరీక్షణ సిబ్బందిలో నైరాశ్యం నింపుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ హోదాల మధ్య లాన్స్ నాయక్, నాయక్ అనే రెండు అదనపు ర్యాంకులను సృష్టించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని అధికారులు భావిస్తున్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 1997లో ఈ ర్యాంకులను రద్దు చేసి, వాటిని కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ హోదాల్లో విలీనం చేశారు. అయితే, భారత సైన్యంలో ఈ ర్యాంకులు ఇప్పటికీ కొనసాగుతుండటం గమనార్హం. ఈ ఏడాది చివరి నాటికి సైన్యంలో నాలుగేళ్ల సేవలు పూర్తిచేసుకుని మొదటి బ్యాచ్ అగ్నివీరులు పదవీ విరమణ చేయనున్నారు. వీరు కేంద్ర సాయుధ బలగాల్లో చేరేందుకు అర్హత కలిగి ఉంటారు. ఈ తరుణంలో సీఆర్పీఎఫ్లో పదోన్నతులు వేగంగా లభిస్తాయనే భరోసా కల్పించడం ద్వారా, నైపుణ్యం గల అగ్నివీరులను పెద్ద సంఖ్యలో ఆకర్షించవచ్చని బలగం భావిస్తోంది. అయితే, ఈ ప్రతిపాదనపై మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. నిర్ణీత కాల పరిమితిలో పదోన్నతులు కల్పిస్తేనే ఈ సంస్కరణలకు నిజమైన ఫలితం ఉంటుందని పారామిలిటరీ మాజీ సిబ్బంది సంఘం నేత ఒకరు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో, కొత్త ర్యాంకుల వల్ల బెటాలియన్ క్రమశిక్షణకు, ఆపరేషనల్ విధులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందని ఓ సీనియర్ కమాండెంట్ పేర్కొన్నారు. మొత్తానికి, సిబ్బంది నైతిక స్థైర్యాన్ని పెంపొందించడంతో పాటు, అగ్నివీరుల చేరికకు మార్గం సుగమం చేసే లక్ష్యంతో సీఆర్పీఎఫ్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తోంది.

## యూపీ, ఉత్తరాఖండ్లో బీజేపీ వ్యూహం..



రానున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ప్రస్తుత ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, పుష్కర్ సింగ్ ధామి నేతృత్వంలోనే పార్టీ ఎన్నికల బరిలోకి దిగాలని నిశ్చయించినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే బీజేపీ కేంద్ర నాయకత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ నిర్ణయం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వానికి, ఢిల్లీలోని కేంద్ర నాయకత్వానికి మధ్య సమన్వయ లోపం, విభేదాలు ఉన్నాయని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్వాదీ పార్టీ గత కొంతకాలంగా విమర్శలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, యోగి నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించడం ద్వారా, పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, ప్రస్తుత నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని బలమైన సంకేతాలను పంపినట్లయింది. 2017 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 403 స్థానాలకు గాను 300కు పైగా సీట్లు సాధించి బీజేపీ ప్రభంజనం సృష్టించగా, యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత 2022 ఎన్నికల్లోనూ 255 స్థానాలతో బీజేపీ తన అధికారాన్ని నిలబెట్టుకుంది. అయితే, ఇటీవలి 2024 లోక్సభ ఎన్నికల్లో యూపీలో బీజేపీ ప్రదర్శన కొంత నిరాశపరిచింది. 2019లో 62 ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్న పార్టీ, ఈసారి కేవలం 33 స్థానాలకే పరిమితమైంది. ఈ ఫలితాల అనంతరం రాష్ట్ర నాయకత్వం మార్పుపై చర్చలు జరిగినప్పటికీ, అధిష్ఠానం మాత్రం యోగి వైపే మొగ్గు చూపడం గమనార్హం. మరోవైపు, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామికి పార్టీ అధిష్ఠానం నుంచి పూర్తిస్థాయి మద్దతు లభించింది. 2021 నుంచి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న ఆయన, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలతో పార్టీని విజయతీరాలకు చేర్చారు. వీటికి తోడు, 2024 లోక్సభ ఎన్నికల్లోనూ రాష్ట్రంలోని మొత్తం ఐదు స్థానాలను బీజేపీ వరుసగా మూడోసారి క్లీన్స్వీప్ చేసింది. ఈ వరుస విజయాలు ధామి నాయకత్వాన్ని పార్టీలో మరింత సుస్థిరం చేశాయి. తాజా నిర్ణయాలతో రెండు కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నాటికి నాయకత్వంపై నెలకొన్న సందిగ్ధతకు బీజేపీ అధిష్ఠానం తెరదించింది. ముందుగానే నాయకత్వ ముఖచిత్రాలను ప్రకటించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో స్పష్టతనిస్తూ, ఎన్నికల ప్రచారంలోకి దూసుకెళ్లేందుకు బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

## ఆన్లైన్ గేమింగ్ ముఠా గుట్టురట్టు

ఆన్లైన్ బెట్టింగ్, గేమింగ్, సైబర్ ఫ్రాడ్ సిండికేట్పై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్, ముంబై, పుణే, మెహసానా, సూరత్ నగరాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో మనీలాండరింగ్కు సంబంధించిన కీలక సమాచారాన్ని గుర్తించినట్లు ఈడీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 13న నిర్వహించిన ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర సాక్ష్యాధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (గ్రామీూ) కింద, ఈ కేసుతో సంబంధం ఉన్న పలు సంస్థలు, వ్యక్తుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు పేర్కొంది. "ఆల్ ప్యానెల్ ఎక్స్ఛేంజ్", "వీ+వీ91" అనే ఆన్లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్ఫామ్ల ద్వారా ప్రజల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకుని మోసం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో భాగంగా గతంలో పుణె, ముంబై, బెంగళూరు నగరాల్లో సోదాలు జరిపిన అధికారులు, ఎడ్సమ్ ఫిన్టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రామ్ యూ రాంధానిని అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. బాధితుల నుంచి సేకరించిన నిధులను రాంధానికి చెందిన పుణె సంస్థ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించినట్లు దర్యాప్తులో తేలింది. రాంధాని సంస్థ "ఐపైసా" (ఞఖఱయి) అనే ప్రత్యేక పేమెంట్ ప్లాట్ఫామ్ను సృష్టించి, దాని ద్వారా ఆన్లైన్ బెట్టింగ్ ఆపరేటర్ల కోసం 200కు పైగా షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా లావాదేవీలు నడిపినట్లు ఈడీ గుర్తించింది. ఈ బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు దుబాయ్ కేంద్రంగా సాగుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ అక్రమ లావాదేవీలకు, నిధుల మళ్లింపునకు కొన్ని సహకార బ్యాంకులు కూడా సహకరించినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఆన్లైన్ బెట్టింగ్ ద్వారా సంపాదించిన డబ్బును మూడు మార్గాల్లో దేశం దాటించినట్లు గుర్తించారు. వాణిజ్య లావాదేవీల ముసుగులో ఓవర్ ఇన్వాయిసింగ్ ద్వారా, ఏపీఎంసీ యూనిట్ల పేరుతో తెరిచిన మ్యూల్ ఖాతాల నుంచి నగదు విత్డ్రా చేయడం ద్వారా, చివరిగా క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చి విదేశాలకు తరలించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది.

## బలూచిస్థాన్లో ఉద్రిక్తత:

## 20 మంది పోలీసుల కిడ్నాప్



పాకిస్థాన్లోని బలూచిస్థాన్ ప్రావిన్స్లో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బలోచ్ వేర్పాటువాదులుగా అనుమానిస్తున్న కొందరు సాయుధులు, శిక్షణలో ఉన్న 20 మంది పోలీసు సిబ్బందిని అపహరించారు. శుక్రవారం సాయంత్రం మస్తుంగ్ జిల్లాలోని గోర్గినా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కలాత్ రిక్రూట్ ట్రైనింగ్ సెంటర్ నుంచి సెలవుపై తమ స్వగ్రామాలకు వెళుతున్న పోలీస్ రిక్రూట్లు ప్రయాణిస్తున్న వ్యాన్ను సాయుధులు అడ్డగించి, వారిని కిడ్నాప్ చేశారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పాకిస్థాన్ భద్రతా బలగాలు, అపహరణకు గురైన పోలీసుల ఆచూకీ కోసం భారీ గాలింపు చర్యలు చేపట్టాయి. మస్తుంగ్ జిల్లా వ్యాప్తంగా చెక్పోస్టులు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశాయి. ఇదే క్రమంలో, టర్బత్ సమీపంలో కొన్ని సరుకు రవాణా ట్రక్కులకు కూడా బలోచ్ వేర్పాటువాదులు నిప్పుపెట్టినట్లు సమాచారం. ఈ ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోంది.

### తెరపైకి కస్టడీ మరణాల ఆరోపణలు

ఈ దాడుల నేపథ్యంలో, బలూచిస్థాన్లో సుదీర్ఘ కాలంగా పాక్ భద్రతా దళాలపై వస్తున్న బలవంతపు అదృశ్యాలు, కస్టడీ మరణాల ఆరోపణలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ఇటీవలే, పర్వేజ్ అనే పాఠశాల ఉపాధ్యాయుడి మృతదేహం పాస్నిలో లభ్యమైంది. అంతకు ఒకరోజు ముందు, కుటుంబ సభ్యుల సమక్షంలోనే పాక్ భద్రతా దళాలు అతన్ని అదుపులోకి తీసుకున్నాయని 'ది బలూచిస్థాన్ పోస్ట్' కథనం ప్రచురించింది. పర్వేజ్ అరెస్టు, మరణంపై పాక్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ ఏడాది ఇలాంటి ఘటనలు పెరిగాయని మానవ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆగస్టులో, పంజ్గూర్కు చెందిన హాతిమ్ బలోచ్ అనే మరో ఉపాధ్యాయుడిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించగా, కొన్ని వారాల తర్వాత ఆయన మృతదేహం లభ్యమైంది. అదేవిధంగా, గత ఏడాది అక్టోబర్లో పాక్ బలగాలు అదుపులోకి తీసుకున్న అయాజ్ బలోచ్ అనే ఉపాధ్యాయుడి మృతదేహం ఈ ఏడాది జనవరిలో లభించింది.

### నివేదికలో సంచలన విషయాలు

'బలోచ్ యక్జెహతీ కమిటీ (బీవైసీ)' విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2026 జనవరి నుంచి జూన్ వరకు బలూచిస్థాన్లో 507 బలవంతపు అదృశ్యాలు నమోదయ్యాయి. వీరిలో 135 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు ఉండటం గమనార్హం. వీరిలో 32 మంది కస్టడీలోనే మరణించారని ఆ సంస్థ ఆరోపించింది. తాజాగా కిడ్నాప్ ఘటన జరిగిన మస్తుంగ్ జిల్లాలోనే అక్టోబర్ 9న ఓ ఇంటిపై డ్రోన్ దాడి జరగగా ఇద్దరు పౌరులు గాయపడ్డారు. జనవాసాలపై పాక్ సైన్యం డ్రోన్లు, ఫైటర్ జెట్లతో దాడులు చేస్తూ పౌరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తోందని బీవైసీ ఆరోపించింది. ఒకవైపు వేర్పాటువాదుల దాడులు, మరోవైపు భద్రతా దళాలపై వస్తున్న తీవ్ర ఆరోపణలతో బలూచిస్థాన్లో సామాన్య పౌరుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

## సంపాదకీయం

# సంభాషణే సమాధానం!

దేశ రాజధానిలో 'కాక్రోచ్' నిరసనకారులు శుక్రవారం మళ్లీ వీధుల్లోకొచ్చారు. ఈ ఆందోళనలు ఎటు వెళ్తున్నాయి, అసమ్మతి గళాలను అణచివేయడానికే పరిమితమైన ప్రభుత్వ ప్రతిస్పందన, కనీసం నియంత్రిత వాతావరణంలోనైనా భిన్నాభిప్రాయం వ్యక్తం చేసే స్వేచ్ఛను అనుమతించే దిశగా మారుతుందా? అనే ప్రశ్నలు మరింత పెరిగాయి. ప్రవేశ పరీక్షల అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలపై నిరసనగా మొదలైన యువత ఆగ్రహం, ఇప్పుడు ఎన్నికల సంస్కరణల తొలి అడుగుగా సీఈసీ జ్ఞానేష్ కుమార్ తొలగింపును కోరే స్థాయికి, ఆపై నిరసన తెలిపే ప్రాథమిక హక్కుపైనే విస్తృత పోరాటంగా మారింది. జంతర్ మంతర్ వద్ద నిరసనలను పోలీసులు డీనోటిఫై చేయడం, తర్వాత అక్కడికి వెళ్లిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను ఐదు రోజుల న్యాయ కస్టడీకి పంపడంతో ఈ మార్పు స్పష్టమైంది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వారిని వెంటనే విడుదల చేయాలని కోరి, శాంతియుత నిరసనకు స్థలం కుంచించుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రశ్నపత్రాల లీకేజీలే ప్రధాన కారణమైనప్పుడు ప్రభుత్వం నిరసనకారులతో మాట్లాడింది, చివరికి విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. కానీ ఇప్పుడు కనిపిస్తున్న శత్రుభావం, నిరసనకారులతో చర్చకు బదులు గొంతు నొక్కే విచిత్ర పద్ధతులకు దారితీసిందన్న విమర్శ ఉంది. అక్టోబర్ 10, 11 తేదీల్లో జరిగిన భారీ నిర్బంధాలు, మెట్రో స్టేషన్ల మూసివేత, రాకపోకల నియంత్రణ, నిరసన వేదికలను ప్రజలకు అందకుండా చేయడం కోసం బలగాలు జర్నలిస్టులను కూడా వదలకుండా వ్యవహరించిన తీరు, ఒక రకమైన "ముట్టడి మనస్తత్వాన్ని" సూచిస్తున్నాయని విమర్శలొచ్చాయి. ఈ సందర్భంలో ప్రపంచంలో నిరసనలకు ప్రభుత్వాల ప్రతిస్పందనలు వేర్వేరుగా ఉంటాయి; ఫ్రాన్స్‌లో దేశవ్యాప్త విద్యార్థి నిరసనలు జరుగుతున్నప్పుడు, అసమ్మతి వ్యక్తం చేసే స్థలాన్ని తెరిచి ఉంచుతూనే, నిరసనలతో తరచూ ముడిపడే అల్లర్ల వంటి అతిక్రమణలను అణచివేసిన దృశ్యాలు చూశాం. భారత్‌లోనూ పోలీసు అతిక్రమణలు లేకపోలేదు. నిరసనలను అణచే బలాన్ని ప్రదర్శించే సందర్భాలూ పునరావృతమవుతున్నాయి.

ఈ పరిణామాల మధ్య ప్రతిపక్షాలు రంగంలోకి దిగడం, యువత ఆగ్రహాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం వాటి ప్రజాస్వామ్య హక్కే. కానీ అదే సమయంలో అధికారం చేజిక్కించుకునే ప్రయత్నంగా దాన్ని చూడటంతో పరిస్థితి ఒక రాజకీయ అగ్నిగుండంగా కనిపిస్తోంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ నెల 12న ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తూ పిటిషన్ సమర్పించేందుకు సుప్రీంకోర్టు వైపు ర్యాలీగా వెళ్లారు; అంతకుముందు ప్రతిపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు వెళ్తూ నిర్బంధానికి గురయ్యారు, ఆపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తమ ఫిర్యాదులు సమర్పించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు గౌరవించాల్సిన, నిష్పాక్షిక మధ్యవర్తిగా భావించే న్యాయవ్యవస్థ అత్యున్నత స్థానంవైపు జనసమూహాన్ని నడిపించినందుకు ప్రతిపక్ష నేతను సుప్రీంకోర్టు మందలించడం చూశాం. ఎంతటి న్యాయమైన ఆందోళనైనా న్యాయస్థానంపట్ల గౌరవాన్ని, నిబంధనలను పాటించాల్సిందే. అదే సమయంలో, ప్రజాస్వామ్య చరిత్రలో భారత్‌కు మూలాధారమైన ఎన్నికల వ్యవస్థను అధికారంలో ఉన్నవారు తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి వంచించారన్న ప్రాథమిక ఆరోపణను పరిశీలించాల్సిన బాధ్యత కూడా న్యాయస్థానాలపై ఉంది. ఎన్నికల సంఘం, అధికార పక్షం ఈ ఆరోపణలను తిరస్కరిస్తున్నాయి; ఎస్ఐఆర్ ప్రక్రియ నిబంధనల ప్రకారమే సాగిందని, ఈ ఏడాది మేలో సుప్రీంకోర్టు కూడా దాని చట్టబద్ధతను సమర్థించిందని నివేదికలు చెబుతున్నాయి. అయినప్పటికీ, సుప్రీంకోర్టు స్వయంగా సెప్టెంబర్ 22న ఢిల్లీలో నోటీసులు "దాదాపు యాంత్రికంగా" వెళ్తున్నాయని, "తార్కిక వ్యత్యాసం" గుర్తింపు ఆధారం స్పష్టం కావాలని చెప్పింది; ఈ విషయంలో విచారణ అక్టోబర్ 28న జరగనుంది. న్యాయస్థానం కూడా ప్రభుత్వం "ఈగను చంపడానికి సుత్తి వాడుతోంది" అని వ్యాఖ్యానించింది. రాజధానిని కోటగా మార్చడం, అన్ని రవాణా సాధనాలను నిలిపివేయడం, ట్రాఫిక్‌ను మళ్లించి నిరసన వేదికలను మూసివేయడం వంటి చర్యలు అంత తీవ్రమైనవన్నది ఆ విమర్శ. ఆసక్తికరంగా, కొన్ని బీజేపీయేతర ప్రభుత్వాలు కూడా నిరసనలను అణచే చర్యలు తీసుకున్నాయన్నది ఈ సమస్య ఒక్క పార్టీకే పరిమితం కాదని సూచిస్తుంది.

మరోవైపు, ప్రజాస్వామ్య మార్గంలో వచ్చిన పరివర్తనకు ఉదాహరణగా బంగ్లాదేశ్‌లో పౌర నిరసనలు పాలన మార్పునకు దారితీసిన సందర్భాన్ని చూపడం ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధం. ప్రస్తుత వ్యవస్థను వ్యతిరేకించే పార్టీలు ఎన్నికలను బహిష్కరించడమో, పోటీ చేయకుండా నిషేధించడమో జరిగే దేశం, అంటే షేక్ హసీనా అవామీ లీగ్ తాజా ఎన్నికల్లో ఎదుర్కొన్న పరిస్థితి, "ప్రజాస్వామ్యానికి మాతృక"గా పరిగణించబడదు. ఇక్కడ అసలు ప్రశ్న సీఈసీ వెళ్లిపోతారా లేదా అన్నది కాదు; ఫారం 6ను మార్చి చట్టబద్ధమైన ఓటర్లకు కూడా జాబితాలో కొనసాగడం కష్టమయ్యేలా చేశారన్న ఆరోపణలకు (వీటిని సంఘం ఖండిస్తోంది) లోనైన ఆయన, సవరించిన జాబితాల చట్టబద్ధతపై తీవ్రమైన సందేహాలు కలిగేంతగా ప్రక్రియను కలుషితం చేశారా లేదా అన్నది సుప్రీంకోర్టు తేల్చాల్సిన విషయం. వెంటనే నిర్ణయించాల్సింది, సుప్రీంకోర్టు ఆమోదం పొందిన ఎస్ఐఆర్ ప్రక్రియను చట్టవిరుద్ధంగా పరిగణించాలా వద్దా అన్నది; జాబితాలను మరణించిన లేదా తాము దేశానికి చెందినవారమని రుజువు చేసుకోలేక అనర్హులైనవారిని మినహాయించి, మిగిలినవారందరినీ కలుపుకునే విధంగా నిర్వహించాలన్నది. పరిష్కారానికి కొన్ని మార్గాలు కనిపిస్తున్నాయి: ప్రభుత్వం 2018 సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తితో నియంత్రణతో కూడిన నిరసన వేదికను, వీలైతే జంతర్ మంతర్‌నే, పునరుద్ధరించడం; పోలీసు అతిక్రమణలపై స్వతంత్ర, కాలపరిమితితో కూడిన విచారణ, జర్నలిస్టులకు రక్షణ; ప్రశ్నపత్రాల లీకేజీల సమయంలో చూపిన సంభాషణ మార్గానికి తిరిగి రావడం; ఎన్నికల సంఘం "తార్కిక వ్యత్యాసాల" ప్రమాణాలను బహిరంగపరచడం, స్వతంత్ర ఆడిట్‌కు అనుమతించడం. నిరసనకారులు, ప్రతిపక్షాలు కూడా శాంతిని, న్యాయస్థానాల పట్ల గౌరవాన్ని కాపాడుకోవాలి. యువత అసలు సమస్యలైన ఉద్యోగాలు, పరీక్షల పారదర్శకత, ఓటు హక్కు రాజకీయ కోలాహలంలో కనుమరుగవకుండా చూడాలి. అసమ్మతి గొంతు నొక్కడం కాదు, వినడం ప్రజాస్వామ్యం నిలబడే అసలైన మార్గం!

## పనికొచ్చే పలుకు



# సింహంలా నడిపిస్తే.. గొర్రెలూ గర్జిస్తాయి!

**సింహం నాయకత్వంలోని గొర్రెల సైన్యం, గొర్రె నాయకత్వంలోని సింహాలను ఓడించగలదని పెద్దల మాట. అంటే బలం కంటే దిశను చూపే నాయకత్వమే గెలుపును నిర్ణయిస్తుంది. కానీ రీల్స్‌లో "ఆరు వారాల్లో అద్భుతం" అంటూ గర్జించేవారిలో నిజమైన నాయకులెందరు? అందుకే ఎవరిని ఫాలో అవుతున్నామో చూసుకోవడమే, మన జీవితాన్ని నడిపే మొదటి నిర్ణయం.**

"రీల్స్‌లో గర్జించే అన్నల్ని చూశారా? వాళ్లు తమను తాము సింహాలనుకుంటారు, ఫాలోయర్లను గొర్రెల్లా చూస్తారు. కానీ అసలు సింహం గర్జనతో కాదు, దిశతో నాయకత్వం వహిస్తుంది. ఒక పాత సామెత ఉంది: సింహం నాయకత్వంలోని గొర్రెల సైన్యం, గొర్రె నాయకత్వంలోని సింహాల సైన్యాన్నీ ఓడించగలదని. అంటే సరైన నాయకత్వం సాధారణ వ్యక్తులనూ అసాధారణ శక్తిగా మార్చగలదు.

అదే టీమ్, అదే వనరులు, అదే తెలివున్నా, నాయకుడు మారితే ఫలితం మారుతుంది. ఎందుకంటే మంచి నాయకుడు ఎవరినీ బలవంతంగా మార్చడు; స్పష్టమైన లక్ష్యమిస్తాడు, నమ్మకం పెంచుతాడు, తప్పులను భయం లేకుండా అంగీకరించే వాతావరణం కల్పిస్తాడు. ఐపీఎల్‌లో చూడండి.. ఆటగాళ్లు వాళ్లే, కెప్టెన్ మారితే ఆట మారుతుంది.

ఇక్కడ అసలు ప్రశ్న: మీ జీవితంలో మిమ్మల్ని నడిపిస్తున్నది ఎవరు? ఉదయాన్నే ఫోన్ తీసి స్క్రోల్ చేస్తే, అల్గారిథమ్ మీ లీడర్ అవుతుంది. ఎవరో ఇన్‌ఫ్లుయెన్సర్ చెప్పింది గుడ్డిగా ఫాలో అయితే, "గొర్రె నాయకత్వంలోని సింహం" అవుతారు, మీ బలం ఉన్నా దిశ లేక వృథా అవుతుంది. అందుకే ముందు సెల్ఫ్-లీడర్‌షిప్ నేర్చుకోండి: మీ రోజును మీరే ప్లాన్ చేయండి, మీ ప్రాధాన్యాలను మీరే నిర్ణయించండి.

"ఈ ఒక్క డ్రింక్‌తో పొట్ట కరుగుతుంది!" అని చెప్పేవారికి గొర్రెల మందను నడిపించే ఆసక్తి ఉంటుంది, మీ ఆరోగ్యం మీద కాదు, మీ క్లిక్కుల మీద. నిజమైన లీడర్ "ఆరు వారాల్లో అద్భుతం" అని చెప్పడు; "ఆరు నెలలు ఓపిక పట్టు, రోజూ ఇది చేయి" అంటాడు. ఎందుకంటే ఆరోగ్యం, సంపద, నైపుణ్యం ఏదైనా షార్ట్‌కట్‌లో రావు. ఒక్క శరీర భాగం నుంచి మాత్రమే కొవ్వు కరిగించడం సాధ్యం కాదని నిపుణులు చెబుతారు. అందుకే ఎవరి మాటనైనా నమ్మేముందు, "ఈయన నాకు దిశ చూపుతున్నాడా? లేక నన్ను అమ్ముతున్నాడా?" అని అడగండి.

సరైన మార్గదర్శిని ఎంచుకోండి: మీరు ఫాలో అయ్యే వ్యక్తులు (మెంటార్, టీచర్, యూట్యూబర్) నిజమైన అనుభవం, నిలకడ ఉన్నవారేనా చూడండి.

ఇతరులను నడిపించడం నేర్చుకోండి: కుటుంబంలో, ఫ్రెండ్స్‌లో, ఆఫీసులో చిన్న బాధ్యత తీసుకోండి. నాయకత్వం పదవి కాదు, ప్రవర్తన.

మీ ఉదాహరణే మీ నాయకత్వం: రోజూ ముప్పై నిమిషాలు నడవండి; మీ చుట్టూ ఉన్నవారు గమనించి మారతారు.

చివరిగా ఒక మాట

గొర్రె అయినా సరైన సింహం వెనుక నడిస్తే గర్జించగలదు; సింహం అయినా తప్పు దారిలో నడిస్తే అడవిలో తప్పిపోతుంది. కాబట్టి లైక్స్ కోసం కాదు, లక్ష్యం కోసం నడిపించే వారినే ఫాలో అవ్వండి, చివరికి మీ జీవితానికి సింహం మీరే అవ్వండి.

## అమెరికా మధ్యంతర పోరు

# భారత్‌పై ప్రభావమెంత!?



అమెరికన్లు నవంబర్ 3న మధ్యంతర ఎన్నికల్లో ఓటు వేయడానికి మూడు వారాలకంటే తక్కువ సమయముంది. అధ్యక్షుడి నాలుగేళ్ల పదవీకాలం మధ్యలో జరిగే ఎన్నికలు కావడంతో వీటికి ఆ పేరు వచ్చింది; అధ్యక్షుడు స్వయంగా బరిలో ఉండరు. భారత ఎన్నికల సంఘంలా కాకుండా, అమెరికా ఫెడరల్ ఎన్నికల సహాయ కమిషన్ ఎన్నికలను నేరుగా నిర్వహించదు. ఓటరు నమోదు, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రధానంగా రాష్ట్ర, స్థానిక అధికారుల చేతుల్లోనే ఉంటాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడి పాలనలో మిగిలిన రెండేళ్లను ప్రభావితం చేసే కాంగ్రెస్‌ను ఓటర్లు ఎన్నుకుంటారు: ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, సెనేట్‌లో 35 స్థానాలకు, అలాగే 39 రాష్ట్రాల గవర్నర్ పదవులకు ఎన్నికలు జరుగుతాయి. సభలో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ ఉంది; నియంత్రణకు 218 స్థానాలు అవసరం. సెనేట్‌లో రిపబ్లికన్లకు 53 స్థానాల బలం ఉండటంతో, డెమొక్రాట్లు మెజారిటీ సాధించాలంటే కనీసం నాలుగు స్థానాలు నికరంగా గెలుచుకోవాలి. అంచనాలు డెమొక్రాట్లకు అనుకూలంగా మారుతున్నాయి. కుక్ పొలిటికల్ రిపోర్ట్ అంచనా ప్రకారం వారు సభలో 9 నుంచి 19 స్థానాలు అదనంగా గెలుచుకోవచ్చు. అక్టోబర్ 16న వెలువడిన విశ్లేషణలు కూడా రిపబ్లికన్లకు ఎదురుగాలి వీస్తోందని సూచించాయి. సెనేట్ పోరు మాత్రం హోరాహోరీగానే ఉంది.

సాధారణంగా మధ్యంతర ఎన్నికలు అధ్యక్షుడి పాలనపై ప్రజాభిప్రాయ సేకరణగా మారతాయి; అధికార పార్టీ స్థానాలు కోల్పోవడం ఆనవాయితీ. ఈసారి డొనాల్డ్ ట్రంప్ ఎన్నికలను తన చుట్టూ తిప్పుతున్నారు. "నేనే బ్యాలెట్‌పై ఉన్నానని భావించి ఓటేయండి" అన్న తరహాలో మద్దతుదారులను సమీకరిస్తూ పలు రాష్ట్రాల్లో ప్రచారం చేస్తున్నారు. తాజా సర్వేలు ఆయన ఆమోద రేటింగ్‌పై తీవ్ర అసంతృప్తిని సూచిస్తున్నాయి; కాంగ్రెస్ ఎన్నికల్లో డెమొక్రాట్లకు కూడా ఆధిక్యం కనిపిస్తోంది. ఇక భారతీయులకు ఆసక్తి కలిగించే పోరు ఒహాయో గవర్నర్ ఎన్నిక. వివేక్ రామస్వామి గెలిస్తే ఆ రాష్ట్ర తొలి భారతీయ-అమెరికన్ గవర్నర్ అవుతారు. అయితే, అక్టోబర్‌మధ్య నాటికి అందుబాటులో ఉన్న సర్వేల సగటులో డెమొక్రాట్ అభ్యర్థి అమీ ఆక్టన్ స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు; కొన్ని వ్యక్తిగత సర్వేల్లో రామస్వామి ముందున్నప్పటికీ, పోటీ ఇంకా ముగిసిపోయినట్లేమీ లేదు. ఆయన భారతీయ మూలాలు, హిందూ విశ్వాసంపై ప్రచారంలోనూ ఆన్‌లైన్‌లోనూ విమర్శలు, ద్వేషపూరిత వ్యాఖ్యలు ఎదురయ్యాయి. హెచ్-1బీ వీసాలపై వివాదాల నేపథ్యంలో అమెరికా కుడిపక్షంలో పెరిగిన భారత వ్యతిరేక వాక్చాతుర్యం కూడా ఈ చర్చలో భాగమైంది.

ఈ ఎన్నికలను ప్రధానంగా ఐదు అంశాలు ప్రభావితం చేస్తున్నాయి: సుంకాలు, జీవన వ్యయంతో పెరిగిన ఆర్థిక ఒత్తిడి; అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధ పరిణామాలు, వాటి ప్రభావంతో ఇంధన ధరల పెరుగుదల; వలసదారులపై కఠిన చర్యలు; మెడికెయిడ్ కోతలతో ఆరోగ్య సంరక్షణపై ఆందోళనలు; నగరాల్లో నేరాల అంశం. ప్రచారంతోపాటు ఓటింగ్ ప్రక్రియపైనా వివాదాలు నెలకొన్నాయి. పౌరసత్వ రుజువుతోనే ఓటరు నమోదు జరగాలన్న ప్రతిపాదనకు ట్రంప్ మద్దతు పలికారు. రిపబ్లికన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నియోజకవర్గాల మ్యాప్‌లను మధ్యంతర ఎన్నికలకు ముందే మార్చే ప్రయత్నాలపైనా విమర్శలు వచ్చాయి.

ఇదే సమయంలో మరో ముప్పు సాంకేతిక రూపంలో ముందుకొస్తోంది: ఆన్‌లైన్ మోసాలు. అక్టోబర్ 15న ఎఫ్‌బీఐ జారీ చేసిన హెచ్చరిక ప్రకారం, మోసగాళ్లు అభ్యర్థుల పేర్లు, ఫొటోలు, లోగోలను నకిలీ విరాళాల వసూళ్లకు, సరుకుల విక్రయాల పేరుతో మోసాలకు, వ్యక్తిగత సమాచారం దొంగిలించేందుకు ఉపయోగిస్తున్నారు. ఏఐ సాధనాలతో అభ్యర్థులు, ప్రభుత్వ సంస్థలు, విశ్వసనీయ వ్యక్తుల స్వరాలు, సందేశాలను కూడా అనుకరిస్తున్నారు. మరుసటి రోజు ఎఫ్‌బీఐ, సిసా కలిసి ఎన్నికల అధికారులు, అభ్యర్థులు, వారి సంస్థలను ఫిషింగ్, స్మిషింగ్ దాడులపై అప్రమత్తం చేశాయి. సాంకేతికత ఇంత అభివృద్ధి చెందినా మోసాలను ఎందుకు అరికట్టలేకపోతున్నామన్న ప్రశ్నకు ఇది ఉదాహరణ. ఏఐ మోసగాళ్లకు మరింత నమ్మదగిన నకిలీలను సృష్టించే సామర్థ్యాన్ని ఇచ్చింది. నమ్మకం, తొందర, భయాలను వారు ఆయుధాలుగా వాడుతున్నారు. దాడి చేసేవారు కొత్త పద్ధతులను వేగంగా అందిపుచ్చుకోవడం, అనేక దేశాలు, అధికార పరిధులు దాటిన నెట్‌వర్కులు దర్యాప్తును కష్టతరం చేస్తున్నాయి.

భారత్‌కు ఈ ఎన్నికలు కీలకమైన సమయంలో వస్తున్నాయి. 2025లో భారత వస్తువులపై అమెరికా సుంకాలు పెరిగి, ఆ తర్వాత 2026 ఫిబ్రవరిలో ప్రకటించిన వాణిజ్య ఒప్పంద చట్రం ప్రకారం పలు భారత ఉత్పత్తులపై పరస్పర సుంకాన్ని 18 శాతానికి తగ్గించే ప్రతిపాదన వచ్చింది. అయితే, మధ్యంతర ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదు. సెప్టెంబర్ 18న ట్రంప్ సంతకం చేసిన రష్యా ఆంక్షల చట్టం, రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని ఆయనకు కల్పించింది. అయితే, అక్టోబర్ 17న ట్రంప్ ఆ చట్టంలోని కీలక ఆంక్షలు, సుంకాల అమలును తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో భారత్‌కు తాత్కాలిక ఊరట లభించినా, భవిష్యత్తులో మళ్లీ ఒత్తిడి వచ్చే అవకాశాన్ని తోసిపుచ్చలేం.

కొత్త హెచ్-1బీ పిటిషన్లపై లక్ష డాలర్ల చెల్లింపు నిబంధన, పాకిస్తాన్ పట్ల వాషింగ్టన్ వైఖరి కూడా భారత్ ఆందోళనలను పెంచుతున్నాయి. వాషింగ్టన్‌లో 42 ఇంటర్వ్యూల ఆధారంగా తక్షశిలా ఇన్‌స్టిట్యూషన్ చేసిన అధ్యయనం, అమెరికా కాంగ్రెస్‌లో భారత్‌కు మద్దతు విస్తృతంగా ఉన్నప్పటికీ, దాన్ని కాపాడేందుకు రాజకీయంగా చురుకుగా నిలిచే వర్గాలు పరిమితమని సూచించింది. చౌక దిగుమతులు, నైపుణ్య వలసలు, రష్యా చమురు కొనుగోళ్లను వ్యతిరేకించే వర్గాలు సంఖ్యలో చిన్నవైనా, రాజకీయంగా చురుకుగా ఉంటాయి. భారత్‌కు మద్దతుదారులు ఉన్నప్పటికీ, భారత్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నందుకు అమెరికా రాజకీయ నాయకులు మూల్యం చెల్లించే పరిస్థితి లేదన్నది ఈ విశ్లేషణలోని కీలకాంశం. డెమొక్రాట్లు సభపై నియంత్రణ సాధిస్తే భారత విద్యార్థులు, కార్మికులకు సంబంధించిన వలస విధానాలపై కొంత ఉపశమనం కోసం ప్రయత్నించవచ్చు; ఇరాన్ యుద్ధాన్ని ముగించి ఇంధన ధరలను తగ్గించాలన్న ఒత్తిడినీ పెంచవచ్చు. అయితే, సుంకాలు లేదా రష్యాపై ఆంక్షలకు సంబంధించిన చట్టంలో మార్పులు వస్తాయని చెప్పలేం.

స్వదేశంలో రాజకీయంగా బలహీనపడిన అధ్యక్షుడు విదేశాంగ విధానంలో విజయాలను సాధించేందుకు ప్రయత్నించవచ్చు. అది భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి దారితీయవచ్చు లేదా కొత్త ఒత్తిళ్లకు కారణం కావచ్చు. అందుకే కాంగ్రెస్‌పై నియంత్రణ ఎవరి చేతుల్లోకి వెళ్లినా, భారత్-అమెరికా సంబంధాలపై శ్వేతసౌధం వైఖరి కీలకంగానే ఉంటుంది. ఇరు పార్టీలతో సంబంధాలను బలోపేతం చేసుకుంటూ, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నిలబెట్టుకోవడమే భారత్‌కు సరైన మార్గం! ■



కంఫర్ట్ ఒక మెత్తటి దుప్పటి లాంటిది; కాసేపు హాయిగా ఉంటుంది, కానీ అదే మిమ్మల్ని ఉన్నచోటే కట్టిపడేస్తుంది. సౌకర్యమే కావాలంటే సాధారణంగా ఉండిపోవచ్చు, అందులో తప్పేమీ లేదు. కానీ మీ జీవితం మీ చేతుల్లో ఉండాలంటే, రేపటి భద్రత మీ సొంతం కావాలంటే, మనసు వద్దన్నా సరే, ఈ రోజు చేయాల్సిన పని ఈ రోజే పూర్తి చేయండి. "రేపు చేద్దాం" అనే ఆలోచనే చాలా కలలను అక్కడే ఆపేస్తుంది. కష్టకాలం వచ్చినప్పుడు వెనక్కి తిరగకండి, ఆ కష్టమే మీ బలానికి పరీక్ష. ఈ రోజు మీరు పడే శ్రమ, రేపటి మీకు మీరిచ్చే గొప్ప బహుమతి.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# కార్లు సైతం కళ్లు తేలేసే వేగం!



స్పెయిన్‌కు చెందిన 27 ఏళ్ల డీగో పోన్సులే, కెనడాలోని క్యూబెక్‌లో మూసివేసిన కొండ రోడ్డుపై స్కేట్‌బోర్డ్‌పై నిలబడి గంటకు 94.34 మైళ్ల (151.83 కి.మీ.) వేగంతో దూసుకెళ్లి కొత్త గిన్నిస్ రికార్డు సృష్టించాడు! చాలా కార్లు కూడా ఆ వేగాన్ని చూడవు. వాస్తవానికి తొలి ప్రయత్నంలోనే 91.27 మైళ్లతో పాత రికార్డును దాటేశాడు, కానీ "ఇంకా తృప్తి లేదు" అని ఐదు రోజులు మంచి వాతావరణం కోసం ఆగి, సెప్టెంబర్ 22న రికార్డు బద్దలు కొట్టాడు. పాత రికార్డు 2017లో ఇదే రోడ్డుపై సృష్టించిన బ్రిటన్ స్కేటర్ పీటర్ కానలీది. చక్రాల కింద కంకర రాళ్లు ఎదురైనా దూసుకెళ్లే పెద్ద, మెత్తటి చక్రాలే తన రహస్యమట!

# వర్షార్పణమైన భారత్-వెస్టిండీస్ ఐదో టీ20

## 2-2తో ముగిసిన ఐదు మ్యాచ్‌ల సిరీస్.. నిర్ణయాత్మక పోరుకు వరుణుడి అడ్డంకి!



**బెంగళూరు:** భారత్--వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్ చివరి పోరు వర్షం కారణంగా రద్దయింది. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో శనివారం (అక్టోబర్ 17) జరగాల్సిన ఐదో టీ20 మ్యాచ్‌కు వరుణుడు పదేపదే అంతరాయం కలిగించడంతో విజేతను నిర్ణయించడం సాధ్యపడలేదు. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2--2తో సమంగా ముగిసింది. ఇరు జట్లు చెరో రెండు విజయాలు సాధించగా, చివరి మ్యాచ్ ఫలితం తేలకపోవడంతో సిరీస్ విజేత ఎవరనే ఉత్కంఠకు తెరపడింది.

**తొమ్మిది ఓవర్లకు కుదించిన మ్యాచ్.. అయినా తప్పని వర్షం**

నిర్ణయాత్మక మ్యాచ్ ప్రారంభానికి ముందే బెంగళూరులో వర్షం ఆటకు ఆటంకంగా మారింది. వాస్తవానికి ఈ మ్యాచ్ పూర్తి స్థాయిలో జరిగి ఉంటే సిరీస్ విజేత ఎవరో తేలేది. అయితే వాతావరణం సహకరించకపోవడంతో మ్యాచ్ నిర్వహణకు అధికారులు పలు ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. వర్షం కారణంగా ఆట ప్రారంభం ఆలస్యమైంది. చివరకు ఇరు జట్ల ఇన్నింగ్స్‌లను తొమ్మిది ఓవర్లకు కుదించి మ్యాచ్‌ను నిర్వహించాలని నిర్ణయించారు.

టాస్ గెలిచిన వెస్టిండీస్ జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత జట్టు బ్యాటింగ్‌కు దిగింది. తక్కువ ఓవర్లలోనే భారీ స్కోరు సాధించాలనే లక్ష్యంతో భారత బ్యాటర్లు వేగంగా పరుగులు సాధించే ప్రయత్నం చేశారు. పవర్‌ప్లేలో దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వర్షం కారణంగా కుదించిన మ్యాచ్ కావడంతో ప్రతి ఓవర్ కీలకంగా మారింది. బ్యాటర్లు వీలైనన్ని ఎక్కువ పరుగులు సాధించేందుకు ప్రయత్నించగా, వెస్టిండీస్ బౌలర్లు వికెట్లు తీసి భారత జట్టు స్కోరును నియంత్రించేందుకు యత్నించారు.

**7.4 ఓవర్లలో 118 పరుగులు**

భారత జట్టు బ్యాటింగ్ కొనసాగుతున్న సమయంలో వర్షం మళ్లీ అంతరాయం కలిగించింది. ఆట నిలిచిపోయే సమయానికి భారత్ 7.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసింది. తక్కువ సమయంలోనే భారత జట్టు మంచి స్కోరు సాధించడంతో మిగిలిన ఓవర్లలో మరిన్ని పరుగులు జోడించే అవకాశం కనిపించింది. ముఖ్యంగా చివరి ఓవర్లలో బ్యాటింగ్ వేగాన్ని మరింత పెంచేందుకు భారత జట్టుకు అవకాశం ఉండేది.

కానీ వర్షం తీవ్రత పెరగడంతో ఆటను తిరిగి ప్రారంభించడం సాధ్యం కాలేదు. మైదాన పరిస్థితులను పరిశీలించిన అధికారులు మ్యాచ్‌ను కొనసాగించలేమని నిర్ణయించారు. దీంతో కీలకమైన ఐదో టీ20 మ్యాచ్ ఫలితం తేలకుండానే రద్దయింది.

**సమంగా సాగిన సిరీస్.. విజేత లేకుండానే ముగింపు**

ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్, వెస్టిండీస్ జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. ఇరు జట్లు చెరో రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించడంతో చివరి మ్యాచ్ సిరీస్ విజేతను నిర్ణయించే కీలక పోరుగా మారింది. స్వదేశంలో సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ భావించగా, భారత గడ్డపై సిరీస్ విజయం సాధించాలనే లక్ష్యంతో వెస్టిండీస్ బరిలోకి దిగింది. అయితే చివరి మ్యాచ్‌లో వర్షం కారణంగా ఇరు జట్లకు తమ పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించే అవకాశం దక్కలేదు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో నాలుగు మ్యాచ్‌ల ఫలితాల ద్వారా ఇరు జట్ల బలాబలాలు స్పష్టమైనప్పటికీ, ఐదో మ్యాచ్ రద్దు కావడంతో ఆధిపత్యాన్ని నిరూపించుకునే తుది అవకాశం చేజారింది. ఫలితంగా సిరీస్ 2--2తో సమంగా ముగిసింది.

**అభిమానులకు నిరాశ**

నిర్ణయాత్మక మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురుచూసిన క్రికెట్ అభిమానులకు వర్షం నిరాశ మిగిల్చింది. చివరి మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌ను సొంతం చేసుకునే అవకాశం రెండు జట్లకూ ఉండటంతో ఈ పోరుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ప్రకృతి సహకరించకపోవడంతో మ్యాచ్ మధ్యలోనే ముగిసింది.

మొత్తంగా భారత్--వెస్టిండీస్ టీ20 సిరీస్ హోరాహోరీగా సాగినా, చివరి మ్యాచ్ రద్దుతో సిరీస్ విజేతను నిర్ణయించలేకపోయారు. ఇరు జట్లు చెరో రెండు విజయాలతో సిరీస్‌ను సమంగా ముగించాయి. కీలకమైన చివరి పోరులో బ్యాటర్లు, బౌలర్లు తమ ప్రతిభను పూర్తిస్థాయిలో ప్రదర్శించే అవకాశం లేకపోవడం ఈ మ్యాచ్‌లో ప్రధాన నిరాశగా నిలిచింది.

## స్పోర్ట్స్

# ఐపీఎల్ 2027 వేలానికి ముహూర్తం ఖరారు..

- ఐపీఎల్ 2027 వేలానికి తేదీ, వేదిక ఖరారు
- డిసెంబర్ 16న గోవాలో జరగనున్న ఆక్షన్
- మూడేళ్ల విరామం తర్వాత భారత్‌లో ఐపీఎల్ వేలం
- ఫ్రాంచైజీల కోరిక మేరకే స్వదేశంలో నిర్వహణ
- ఆటగాళ్ల జాబితా, పర్స్ వివరాలు త్వరలో వెల్లడి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అభిమానులకు బీసీసీఐ కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఐపీఎల్ 2027 సీజన్‌కు సంబంధించిన వేలం తేదీని, వేదికను బోర్డు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వేలం ప్రక్రియ డిసెంబర్ 16న గోవా వేదికగా జరగనుంది. ఈ మేరకు మొత్తం 10 ఐపీఎల్ ఫ్రాంచైజీలకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నుంచి శనివారం సమాచారం అందినట్లు తెలుస్తోంది. గోవాలోని ఐటీసీ గ్రాండ్ హోటల్ ఈ వేలానికి ఆతిథ్యం ఇవ్వనుంది. వేలానికి ఒక రోజు ముందు, అంటే డిసెంబర్ 15న ఫ్రాంచైజీల ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా బ్రీఫింగ్ సెషన్ నిర్వహించనున్నారు. బీసీసీఐ లాజిస్టిక్స్ బృందం ఇప్పటికే వాట్సాప్ సందేశం ద్వారా ఫ్రాంచైజీలకు ప్రాథమిక సమాచారం అందించగా, దీనిపై అధికారికంగా ఈ-మెయిల్ ద్వారా ధ్రువీకరణ రావాల్సి ఉంది. గత మూడు సీజన్లుగా ఐపీఎల్ వేలం విదేశీ గడ్డపైనే నిర్వహించారు. 2024 సీజన్ కు దుబాయ్, 2025 సీజన్ కు జెద్దా, 2026 సీజన్ కు అబుదాబి నగరాలు ఈ వేలానికి ఆతిథ్యమిచ్చాయి. ఈ క్రమంలో మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐపీఎల్ వేలం తిరిగి భారత్‌లో జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫ్రాంచైజీల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న బోర్డు, ఈసారి స్వదేశంలోనే వేలం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వంటి అధికారులు డిసెంబర్ మధ్యలో గోవాలో వేలం జరపవచ్చని సంకేతాలిచ్చారు.



స్ట్రాప్‌లెస్ డెనిమ్ బాడీకాన్ డ్రెస్‌లో ఆకట్టుకుంటున్న అవికా గోర్

# నాని స్టైల్ అదుర్స్.. 'బ్లడీ రోమియో' కోసం లుక్ ఛేంజ్!



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో దూసుకుపోతూ తన మార్కెట్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తున్నారు. ఇటీవలే విడుదలైన 'ది ప్యారడైజ్' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న నాని, వెంటనే తన తదుపరి గ్యాంగ్‌స్టర్ డ్రామా 'బ్లడీ రోమియో' కోసం సిద్ధమయ్యారు. స్టైలిష్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా కోసం నాని సూపర్ స్టైలిష్ మేకోవర్ అయ్యారు. తాజాగా పూర్తయిన ఈ ఫోటోషూట్ విశేషాలు మరియు సినిమా అప్‌డేట్స్ వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

**సుజీత్ మార్క్ వింటేజ్ అండ్ స్టైలిష్ లుక్:**

టాలీవుడ్ లో 'రన్ రాజా రన్', 'సాహో', 'ఓజీ' వంటి చిత్రాలతో తనదైన స్టైలిష్ మేకింగ్‌తో ఆకట్టుకున్న దర్శకుడు సుజీత్, ఈసారి నాని లుక్‌ను పూర్తిగా రీఇన్వెంట్ చేశారు. ఈ సినిమా కోసం నాని తన హెయిర్‌స్టైల్‌ను మార్చడంతో పాటు క్రేజీ ట్రెండీ స్పెక్స్ ధరించి సరికొత్త గ్లామరస్ అండ్ రఫ్‌గా కనిపించనున్నారు. ఇక మేకర్స్ ఇప్పటివరకు నాని పూర్తి లుక్‌ను బయటకు వదలకుండా కేవలం గ్లింప్స్‌తోనే ప్రేక్షకుల్లో అంచనాలను విపరీతంగా పెంచేశారు.

**రోమియో కిచెన్ షురూ కాబోతోంది:**

గత రెండేళ్లుగా 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్న నాని, ఇప్పుడు ఎలాంటి గ్యాప్ తీసుకోకుండా 'బ్లడీ రోమియో' సెట్స్‌లోకి అడుగుపెడుతున్నారు. అక్టోబర్ 16 లేదా 17 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. తొలి షెడ్యూల్‌లోనే కొన్ని అత్యంత కీలకమైన యాక్షన్ ఘట్టాలను చిత్రీకరించేందుకు సుజీత్ అండ్ టీమ్ పక్కా ప్లాన్‌తో సిద్ధమయ్యారు.

**నాని వైవిధ్యమైన క్యారెక్టరైజేషన్:**

ఫిల్మ్‌నగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ గ్యాంగ్‌స్టర్ అవతారంలో అలరించబోతున్నారు. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా ఒక డిఫరెంట్ షేడ్ ఉన్న చెఫ్ పాత్రలోనూ లేదా ద్విపాత్రాభినయంలోనూ ఆయన కనిపిస్తారని టాక్ నడుస్తోంది. ఒకవైపు మాస్ యాక్షన్, మరోవైపు వింటేజ్ స్టైల్స్ కలగలిపి సుజీత్ ఈ కథను ఎంతో ఆసక్తికరంగా డిజైన్ చేశారు.

**నిర్మాణంలో రాజీ పడని మేకర్స్:**

ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను వెంకట్ బోయినపల్లి నిహారిక ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ మాస్టర్ చెఫ్స్ కాంబినేషన్‌లో వస్తున్న 'బ్లడీ రోమియో' థియేటర్లలో ప్రేక్షకులకు మైండ్ బ్లాకింగ్ ఫీస్ట్ ఇవ్వడం ఖాయమని మేకర్స్ నమ్ముతున్నారు. సుజీత్ దర్శకత్వం, నాని పాత్ర ఈ సినిమాను పాన్ ఇండియా రేంజ్‌కు తీసుకెళ్తాయని భావిస్తున్నారు. 'బ్లడీ రోమియో' కోసం నాని కొత్త లుక్‌లోకి మారడం ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్‌గా మారింది. ఇప్పటికే విడుదలైన అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలు పెరిగాయి. నాని పూర్తి లుక్ బయటకు వస్తే ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.



ఐవరీ రంగు తామర పువ్వుల డిజైన్ చీరలో పండుగ శోభను వెదజల్లుతున్న రీతూ వర్మ

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com